www.vishalabharati.com
epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్
16 అక్టోబర్ 2023
సంపుటి:1 సంచిక:312

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించింది. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఎలక్షన్‌హామీలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. తమ పార్టీయే మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తాము మూడోసారి అధికారంలోకి వస్తే ప్రస్తుత పథకాలను కొనసాగించడంతో పాటు కొత్త హామీలను ఆరు నెలల్లోనే అమలు చేస్తామని చెప్పారు. గత ఎన్నికల ప్రణాళికలో చెప్పని అంశాలను సైతం అమలు చేసిన ఘనత తమదేనన్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. గులాబీ బాస్‌మేనిఫెస్టోలో నిరుద్యోగుల ఊసే ఎత్తకపోవడంతో విద్యార్థి, నిరుద్యోగులు రగిలిపోతున్నారు.

## “నిరుద్యోగులను లైట్ తీసుకున్నడు!





### బీఆర్ఎస్ మేనిఫెస్టోలో కనిపించని ఉద్యోగాల ప్రస్తావన

- యువతకు ఒక్క హామీ కూడా ఇవ్వని కేసీఆర్
- గతంలో ప్రకటించిన నిరుద్యోగ భృతి ఊసే లేదు
- గులాబీ బాస్ మేనిఫెస్టోపై గుర్రుగా నిరుద్యోగులు
- కాంగ్రెస్ పార్టీ హామీలే చాలా బెటర్ అని కామెంట్స్
- బీఆర్ఎస్ వరాలు అమలుపై ఆర్థిక నిపుణుల సందేహాలు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

**ఫైర్‌అవుతున్న విద్యావంతులు**

కాంగ్రెస్‌కు పోటీగా రైతుబంధు పెంపు, రూ.400 కే గ్యాస్ సిలిండర్ , మహిళలకు నెలకు రూ.3 వేల భృతి లాంటి హామీలు ఇచ్చిన కేసీఆర్.. నిరుద్యోగులకు సంబంధించి మేనిఫెస్టోలో ఒక్క అంశాన్ని కూడా పొందు పర్చలేదు. దీనిని బట్టి చూస్తే నిరుద్యోగులను కేసీఆర్ లైట్ తీసుకున్నట్లు అర్థమవుతుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే నిరుద్యోగులు కేసీఆర్ ప్రభుత్వంపై కోపంగా ఉన్నారు. జాబ్ నోటిఫికేషన్లు విడుదల చేసినా ఎన్నికల వల్ల ఎగ్జామ్స్ అన్నీ వాయిదా పడటంతో అభ్యర్థులు నిరాశలో కూరుకుపోయారు. గ్రూప్1 రద్దుతో పాటు గ్రూప్2, డీఎస్సీ లాంటి పలు పరీక్షలు వాయిదా పడడంతో కోచింగ్ సెంటర్లలో చేరిన అభ్యర్థులందరూ తిరిగి తమ స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. మేనిఫెస్టోలో నిరుద్యోగుల ప్రస్తావన లేకపోవడంతో గులాబీ బాస్ పై నిరుద్యోగులు ఫైర్ అవుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో దాదాపు 200 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు రాక ఆత్మహత్యలు చేసుకున్నారని విపక్ష నేతలు ఆరోపిస్తున్నా కేసీఆర్ వారిని పట్టించుకోకపోవడంపై గుర్రుగా ఉన్నారు. మరోవైపు బీఆర్ఎస్ మేనిఫెస్టోలో కూడా నిరుద్యోగులకు మొండిచేయే మిగిలిందని వారు మండిపడుతున్నారు. కేసీఆర్ కుటుంబం బాగుంటే చాలు.. మమ్మల్ని కనీసం మనుషులుగా కూడా చూడటం లేదని వారు వాపోతున్నారు. నిరుద్యోగులను మరిచిన కేసీఆర్‌కు ఓటుతోనే బుద్ధిచెబుతామని నిరుద్యోగులు హెచ్చరిస్తున్నారు.

**'కాంగ్రెస్ గ్యారంటీలే' బెటర్**

14 పేజీలతో బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను సీఎం కేసీఆర్ ఇవాళ విడుదల చేయగా.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు పోటీగా ఇందులో భారీ హామీలు ఇచ్చినట్లు కనిపిస్తుంది. ఓటర్లను ఆకట్టుకోవడమే లక్ష్యంగా మ్యానిఫెస్టో నిండా సంక్షేమ పథకాలు పొందుపరిచినట్లు అనిపిస్తుంది. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలకు మించి కేసీఆర్ హామీలు ప్రకటించేందుకు గులాబీ దళపతి ప్రయత్నించినట్లు ఉంది. ప్రధానంగా రైతులు, మహిళలు, పెన్షన్‌దారులు, బీపీఎల్ కుటుంబాలకు బీఆర్ఎస్

..మిగతా 2 లో

**నిరుద్యోగుల ప్రస్తావన నిల్..**

రైతులు, మహిళలు, జర్నలిస్టులు, ఉద్యోగులు, బీసీలు, దళితులకు పలు హామీలు ప్రకటించగా.. మేనిఫెస్టోలో నిరుద్యోగుల ప్రస్తావన కనిపించలేదు. నిరుద్యోగులకు అసలు ఒక్క హామీ కూడా ఇవ్వలేదు. గతంలో హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతిపై కూడా ప్రస్తావించలేదు. కొత్త ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు సాయం గురించి మేనిఫెస్టోలో అసలు ప్రస్తావనే లేదు. నిరుద్యోగులకు టీ కాంగ్రెస్ ఇప్పటికే పలు హామీలు ప్రటించింది. నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతితో పాటు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ఉద్యోగ క్యాలెండర్ రిలీజ్ లాంటి హామీలను యూత్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ప్రకటించింది.

## 55 మందితో కాంగ్రెస్ తొలి జాబితా



- కొడంగల్ నుంచి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీ
- నల్గొండ నుంచి బరిలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఉత్తమ్, మైనంపల్లి కుటుంబాలకు రెండేసి టికెట్లు
- వామపక్షాలతో పొత్తుపై స్పష్టత అనంతరం మిగతా స్థానాలకు ప్రకటన
- కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకే భద్రాచలం టికెట్

హైదరాబాద్,విశాలభారతి: రాజకీయ వర్గాలు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న తెలంగాణ కాంగ్రెస్ తొలి జాబితా విడుదలైంది. మొత్తం 55 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను కాంగ్రెస్ అధిష్టానం ఆదివారం ఉదయం విడుదల చేసింది. వామపక్షాలతో పొత్తుపై స్పష్టత వచ్చిన అనంతరం మిగతా స్థానాలపై చర్చించి బుధ, గురువారాల్లో రెండో జాబితాను విడుదల చేయనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఖమ్మం నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బరిలోకి దిగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, మొదటి జాబితాలో వీరి పేర్లు లేవు. తొలి జాబితా ప్రకారం.. మైనంపల్లి కుటుంబానికి రెండు టికెట్లు దక్కాయి. సిట్టింగ్ ఎంపీ ఉత్తమ్ కుమార్ హుజూర్ నగర్ నుంచి పోటీ చేస్తుండగా.. ఆయన సతీమణి పద్మావతి రెడ్డికి కోదాడ టికెట్ కేటాయించారు. కొడంగల్ నుంచి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, నల్గొండ నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పోటీ చేయనున్నారు. పొత్తుల్లో భాగంగా వామపక్షాలు భద్రాచలం టికెట్‌ను డిమాండ్ చేసినప్పటికీ.. కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకే మళ్లీ ఆ స్థానం కేటాయించారు.

..మిగతా 2 లో




## గెలుపు మాదే..

- 95 నుంచి 100 సీట్లు గెలుస్తం
- 60 వేల భారీ మెజార్టీతో సతీష్ ను గెలిపించాలి
- హుస్నాబాద్ కరువును తరిమికొట్టాం
- గౌరవెల్లి, శనిగరం ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
- తొలి ఎన్నికల సభ హుస్నాబాద్ లో కేసీఆర్

**సిద్దిపేట, విశాల భారతి:** హుస్నాబాద్ నియోజకవర్గం వేదికగా సీఎం కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల శంఖారావాన్నిపూరించారు. హుస్నాబాద్ గెలుపు.. బీఆర్ఎస్ పార్టీ 95 నుంచి 100 సీట్లు గెలిచేందుకు నాంది కావాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్షించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే సతీశ్ బాబుకు ప్రతి ఒక్కరు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. 60 వేల భారీ మెజార్టీతో గెలుస్తారని విశ్వాసం ఉందన్నారు. హుస్నాబాద్ గెలుపు.. 95 నుంచి 100 సీట్లు గెలిచేందుకు నాంది కావాలన్నారు. ఒకప్పుడు హుస్నాబాద్ కరువు ప్రాంతమని కేసీఆర్ గుర్తు చేశారు. కానీ ఇవాళ హెలికాప్టర్ నుంచి చూస్తుంటే చాలా ఆనందం కలిగిందన్నారు. కనుచూపు మేర పంట పొలాలు కనబడుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన మహాసముద్రం గండి పూర్తి చేయడంతో 10, 12 గ్రామాల్లో ఊటలు పెరిగాయని కేసీఆర్ గుర్తు చేశారు. గౌరవెల్లి, శనిగరం ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల తర్వాత ఐదారు నెలల్లో యుద్ధప్రతిపాదన శనిగరం ప్రాజెక్టు ప్రధాన కాల్వ పనులను పూర్తి చేస్తామన్నారు.



## గత హామీలే నెరవేర్చలేదు కొత్త హామీలేంటి?

**మేనిఫెస్టోపై వైఎస్ షర్మిల ఫైర్**

**విశాలభారతి, తెలంగాణ బ్యూరో:** "కొండంత రాగం తీసి పిల్లికూత కూసినట్లుంది కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టో. పోయిన ఎన్నికలకు ఇచ్చిన హామీలే నెరవేర్చే దిక్కు లేదు. మళ్లీ కొత్త కథ మొదలు పెట్టిండు. బ్రతుకు మీద ఇవ్వాల్సిన ధీమా పక్కన పెట్టి పోయాక భీమా ఇస్తాడట. సున్నా వడ్డీకే రుణాలు అని మోసం చేసిన దొర. ప్రతి మహిళకు నెలకు రూ. 3 వేలు ఇస్తామనడం హాస్యాస్పదం. నిరుద్యోగ భృతి అని గత మేనిఫెస్టోలో పెట్టిన పథకానికే దిక్కులేదు కానీ.. ఇప్పుడు రూ. 3 వేలు ఇస్తామంటే నమ్మాలా?. విడతల వారీగా పెన్షన్ల పెంపు ఒక పెద్ద జోక్. రుణమాఫీ పై దొర యూ టర్న్. ఉద్యోగాలు ఇవ్వలేక ఏనాడో చేతులెత్తేశారు. ఉన్న పథకాలను పాతర పెట్టి ఓట్ల కోసం కొత్త పథకాలు అంటూ డ్రామాలు తప్ప మరోటి లేదు. బందిపోట్లు సమితి మేనిఫెస్టో ఓట్ల కోసం తప్ప ప్రజల కోసం కాదు." అని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు.




## మభ్యపెట్టేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ హామీలు

- ఈ మేనిఫెస్టోలపై జనానికి నమ్మకం లేదు
- దళితబంధు ఎందుకు అమలు చేయలేదు
- తెలంగాణలో గెలిచేది బీజేపీ
- ఆ పార్టీ స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి

**విశాలభారతి, హైదరాబాద్:**

ప్రజలను మభ్యపెట్టేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ ఇబ్బడి ముబ్బడిగా హామీలు ఇస్తున్నాయని స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి ఆరోపించారు. ఆ రెండు పార్టీలు ఒక్క హామీని కూడా అమలు చేయవని విమర్శించారు. బీఆర్ఎస్ గతంలో ఇచ్చిన హామీలనే అమలు చేయలేకపోయిందని విమర్శించారు. దళితబంధు లాంటి పథకాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మాయమాటలు చెప్పి మోసం చేయడమే ముఖ్యమంత్రి కేసీఆర్ నైజమని కిషన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ కూడా ఇచ్చిన హామీలను ఎప్పుడూ నెరవేర్చలేదన్నారు. “కాంగ్రెస్, బీఆర్ఎష్ .. ప్రజలను మభ్యపెట్టేందుకు సిద్ధమయ్యాయి. గతంలో ఇచ్చిన హామీలను కేసీఆర్ గుర్తుకు తెచ్చుకోవాలి. కేజీ టూ పీజీ విద్య ఏమైందో కేసీఆర్ చెప్పాలి. 24 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం ఏమైందో చెప్పాలి. ఉచిత విత్తనాలు, ఎరువుల హామీ ఏమైంది?'' అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. రేషన్‌కార్డు ఇవ్వని సర్కారు సన్నబియ్యం ఇస్తామనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోపై ఎవరికీ విశ్వాసం లేదని తెలంగాణ ఎన్నికల ఇన్‌ఛార్జి ప్రకాశ్ జావదేకర్ విమర్శించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2014లో తొలిసారి అధికారం చేపట్టినప్పుడు ఇచ్చిన ఎన్నికల హామీలే ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. దళిత బంధు ఇంకో బంధు అంటూ అనేక పథకాలు ప్రకటించారు కానీ, ఏ ఒక్కటీ అమలు చేయలేదని ఎద్దేవా చేశారు.

## 6 గ్యారెంటీలు కాపీ

- కాంగ్రెస్ హామీలు అమలు అసాధ్యమన్నారు
- మీరు ఇప్పుడు అవే హామీలు ఎందుకిచ్చినట్టు
- బీఆర్ఎస్ మద్యం, డబ్బు పంచకుండా ఎన్నికలకు వెళ్లగలదా?
- కేసీఆర్ ఇక రెస్ట్ తీసుకో :- పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి



**విశాలభారతి,హైదరాబాద్:**

తమ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సీఎం కేసీఆర్ కాపీ కొట్టారని పీసీసీ చీఫ్ రేవంత్ ఆరోపించారు. తాము హామీలు ఇస్తే అమలు సాధ్యం కాదని చెప్పిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు అవే హామీలు ఎలా ప్రకటించారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను కాపీ కొట్టి సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రకటించారని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన ఎన్నికల హామీలు అమలు కావని చెబుతున్న బీఆర్ఎస్ ఇప్పుడు తమకన్నా కొంచం ఎక్కువే ప్రకటించడంతో కాంగ్రెస్ హామీలు అమలు సాధ్యమేనని తెలియజేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్కు రేవంత్ రెడ్డి రెండు చాలెంజ్లు విసిరారు. ఎన్నికల్లో లబ్ధిపొందడానికి బీఆర్ఎస్ చుక్క మద్యం పంచదని, డబ్బులు వెదజల్లదని ప్రమాణం చేయగలదా అని రేవంత్ ప్రశ్నించారు. ఈ చాలెంజ్ను స్వీకరిస్తే అక్టోబర్ 17న తాను అమరవీరుల స్థూపం వద్దకు వస్తానని, కేసీఆర్ కూడా వచ్చి అమరుల సాక్షిగా ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 1నే ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు వేయగలరా అని ప్రశ్నించారు. కేసీఆర్ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని.. రాష్ట్రంలో కచ్చితంగా కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ ఇండియా

..మిగతా 2 లో

## 70 సీట్లు గెలవబోతున్నాం



- టికెట్ రాలేదని బాధపడొద్దు
- కాంగ్రెస్ జెండా మోసినోళ్లకు న్యాయం జరుగుతుంది
- అధికారంలోకి వచ్చాక పదవులు ఇస్తాం
- పొన్నాల లక్ష్మయ్య కాదు డాలర్ లక్ష్మయ్య
- కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

..మిగతా 2 లో



# సీఎం కేసీఆర్ తో పొన్నాల భేటీ

## ఇటీవల కాంగ్రెస్ కు రిజైన్ చేసిన పొన్నాల

**విశాలభారతి,హైదరాబాద్:**

తెలంగాణ సీఎం కేసీఆర్ తో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య భేటీ అయ్యారు. ఆదివారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ప్రగతి భవన్ కు వచ్చిన పొన్నాల దంపతులను సీఎం సాదరంగా ఆహ్వానించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పొన్నాల, కేసీఆర్ కీలక విషయాలపై చర్చించారు. కాగా, తనకు కాంగ్రెస్ లో అవమానం జరిగిందని ఇటీవలే పొన్నాల ఆ పార్టీకి రాజీనామా చేశారు.

**కేటీఆర్ ఆహ్వానం**

కాంగ్రెస్ పార్టీకి పొన్నాల లక్ష్మయ్య రాజీనామా చేసిన అనంతరం, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి ఆయన ఇంటికి వెళ్లారు. బీఆర్ఎస్ పార్టీలోకి రావాలని ఆహ్వానించగా పొన్నాల సుముఖత వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆయన ఆదివారం సీఎం కేసీఆర్ తో సమావేశమయ్యారు.

# 6 గ్యారెంటీలు కాపీ

**మొదటిపేజీ తరువాయి**

కూటమి లో చేరుతామంటే గేటు కూడా తాకనివ్వలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కొల్లగొడుతున్న సొమ్ముతో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అమలు చేయవచ్చని స్పష్టం చేశారు. కేసీఆర్కు వయస్సు అయిపోయిందని తన సూచనగా ఇంట్లోనే ఉంటూ రెస్ట్ తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్లు పొందిన అభ్యర్థులకు రేవంత్ అభినందనలు తెలిపారు. తమ అభ్యర్థులను ప్రకటించే వరకు కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థులకు బీఫారాలు ఇవ్వలేదని అన్నారు. తమ గ్యారంటీ స్కీంలను చేసి కేసీఆర్ కంగారు పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన ప్రస్తుతం పరాన్నజీవిలా మారారని.. కాంగ్రెస్ హామీలనే బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ గ్యారెంటీ హామీలు కర్ణాటకలో కూడా అమలు చేస్తున్నట్లు రేవంత్ గుర్తు చేశారు. బ్లాక్ అండ్ వైట్ సినిమాను కలర్ లో చూపించినట్లు బీఆర్ఎస్ మేనిఫెస్టో ఉందని.. పాత హామీలనే అమలు చేయకుండా.. ఇప్పుడు మరో సారి మోసం చేద్దామని ముందుకొచ్చినట్లు విమర్శించారు. 'కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించగానే కేసీఆర్ తమ అభ్యర్థులకు బీఫారాలు ఇచ్చారు. 115 మంది అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్ 51 మందికే బీఫారాలు ఎందుకిచ్చారు. కాంగ్రెస్ 6 గ్యారెంటీలు చూడగానే సీఎం కేసీఆర్‌కు చలిజ్వరం వచ్చింది. ఇతర పార్టీల మేనిఫోస్టోలను కాపీ కొట్టేందుకే ఆయనకు సమయం సరిపోతోంది. కేసీఆర్ నిరంతరం మద్యం, మైనింగ్, ల్యాండ్ మాఫియా ద్వారా ఎలా సంపాదించాలనే ఆలోచనలు చేస్తుంటారు. కాంగ్రెస్ ప్రకటించిన హామీలనే కేసీఆర్ ఒక్కో వెయ్యి పెంచుతూ కాపీ కొట్టారు. స్వంతంగా ఆలోచన చేసే శక్తిని కేసీఆర్ కోల్పోయారు. పరాన్నజీవిగా మారిపోయారు. కాంగ్రెస్ ప్రకటించిన హామీలు అసాధ్యం అని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు మేనిఫెస్టోలో ఎలా పెట్టారు? ఒకప్పుడు కేసీఆర్ అడుగుల్లో ఇతర పార్టీలు నడుస్తాయని అనేవారు. ఆలోచనలు క్షీణించిన కేసీఆర్ ఇప్పుడు కాంగ్రెస్‌ను అనుసరిస్తున్నారు.'అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## 55 మందితో కాంగ్రెస్ తొలి జాబితా

1. బెల్లంపల్లి (ఎస్సీ) - గడ్డం వినోద్
2. మంచిర్యాల - కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు
3. నిర్మల్ - కుచడి శ్రీనివాస రావు
4. ఆర్మూర్ - ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి
5. బోధన్ - పి సుదర్శన్ రెడ్డి
6. బాల్కొండ - సునీల్ కుమార్ ముత్యాల
7. జగిత్యాల - టీ.జీవన్ రెడ్డి
8. ధర్మపురి (ఎస్సీ) - అడ్లూరి లక్ష్మణ్ కుమార్
9. రామగుండం - ఎంఎస్ రాజ్ ఠాకూర్
10. మంథని - శ్రీధర్ బాబు
11. పెద్దపల్లి - చింతకుంట విజయ రామణ రావు
12. వేములవాడ - ఆది శ్రీనివాస్
13. మానకొండూర్(ఎస్సీ) - డా.కవ్వంపల్లి సత్యనారాయణ
14. మెదక్ - మైనంపల్లి రోహిత్ రావు
15. ఆందోల్ (ఎస్సీ) - సీ. దమోదర్ రాజనర్సింహ
16. జహీరాబాద్ (ఎస్సీ) - అగం చంద్రశేఖర్
17. సంగారెడ్డి - తూరుపు జగ్గారెడ్డి
18. గజ్వేల్ - తూముకుంట నర్సారెడ్డి
19. మేడ్చల్ - తోటకూర వర్జేస్ యాదవ్
20. మల్కాజ్‌గిరి - మైనంపల్లి హన్మంతరావు
21. కుత్బుల్లాపూర్- కోలన్ హన్మంత్ రెడ్డి
22. ఉప్పల్ - ఎం. పరమేశ్వర్ రెడ్డి
23. చేవెళ్ల (ఎస్సీ) - పమేన భీమ్‌భారత్
24. పరిగి - టీ. రామ్ మోహన్ రెడ్డి
25. వికారాబాద్ (ఎస్సీ) - గడ్డం ప్రసాద్ కుమార్
26. ముషీరాబాద్ - అంజన్ కుమార్ యాదవ్ మందాడి
27. మలక్‌పేట్ - షేక్ అక్బర్
28. సనత్‌నగర్ - డా.కోట నీలిమా
29. నాంపల్లి - మహ్మద్ ఫిరోజ్ ఖాన్
30. కార్వాన్ - ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హజ్రి
31. గోషామహల్ - మొగిలి సునీత
32. చంద్రాయణగుట్ట - బోయ నగేష్ (నరేష్)
33. యాకత్‌పురా - కే. రవి రాజు
34. బహదురపుర - రాజేష్ కుమార్ పులిపాటి
35. సికింద్రాబాద్ - ఆడమ్ సంతోష్ కుమార్
36. కొడంగల్ - అనుముల రేవంత్ రెడ్డి
37. గద్వాల్ - సరిత తిరుపతయ్య
38. ఆలంపూర్ (ఎస్సీ)- డా.ఎస్ఏ సంపత్ కుమార్
39. నాగర్‌కర్నూల్ - డా.కూచకుళ్ల రాజేష్ రెడ్డి
40. అచ్చంపేట (ఎస్సీ) - డా.చిక్కుడు వంశీకృష్ణ
41. కల్వకుర్తి - కసిరెడ్డి నారాయణ రెడ్డి
42. షాద్‌నగర్ - కే.శంకరయ్య
43. కొల్లపూర్ - జూపల్లి కృష్ణారావు
44. నాగార్జునా సాగర్ - జయవీర్ కుందూరు
45. హుజూర్‌నగర్ - నలమడ ఉత్తమ్ కుమార్ రెడ్డి
46. కోదాడ - నలమడ పద్మావతి రెడ్డి
47. నల్లగొండ - కోమటరెడ్డి వెంకటరెడ్డి
48. నకిరేకల్ (ఎస్సీ) - వేముల వీరేశం
49. ఆలేరు - బీర్ల ఐలయ్య
50. స్టేషన్‌ఘన్‌పూర్ (ఎస్సీ) - సింగాపురం ఇందిర
51. నర్సంపేట - దొంతి మాధవ్ రెడ్డి
52. భూపలపల్లి - గండ్ర సత్యనారాయణ రావు
53. ములుగు (ఎస్టీ) - ధనసరి అనసూయ (సీతక్క)
54. మధిర (ఎస్సీ) - భట్టి విక్రమార్క
55. భద్రాచలం (ఎస్టీ) - పోదెం వీరయ్య.

# 'భీమ్' కే ఛాన్స్

**విశాల భారతి, హైదరాబాద్:**

టీపీసీసీ ప్రచార కమిటీ మెంబర్ పామెన భీమ్ భారత్‌కు చేవెళ్ల కాంగ్రెస్ టికెట్ దక్కింది. గత ఎన్నికల్లో టికెట్ ఆశించిన బంగపడ్డ ఆయన ఈ సారి మాత్రం అనుకున్నది సాధించారు. ఆదివారం ఏఐసీసీ 56 మంది అభ్యర్థులతో విడుదల చేసిన తొలి జాబితాలో ఆయనకు అవకాశం లభించింది. అనంతరం ఆయన చేవెళ్ల జిల్లా కేంద్రానికి చేరుకోగా.. పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. పటాకులు పేల్చి, స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు. ముందుగా భీమ్ భారత్ పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డ షాబాద్ దర్శన్, సున్నపు వసంతంలను వారి నివాసాలకు వెళ్లి కలిశారు. పార్టీ కోసం కలిసి పనిచేద్దామని కలిసి రావాలని కోరారు. అనంతరం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అలాగే దర్గాకు వెళ్లి చాదర్ కప్పి ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. తర్వాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడారు.

**పార్టీకి ద్రోహం చేసిన యాదయ్యకు గుణపాఠం తప్పదు**

కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యే కాలె యాదయ్యకు ఎన్నికల్లో గుణపాఠం తప్పదని భీమ్ భారత్ హెచ్చరించారు. పదేళ్లుగా కుటుంబ పాలన సాగిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కబ్జాలను ప్రోత్సహిస్తూ అక్రమంగా డబ్బులు సంపాదించారే తప్ప ప్రజలను ఏనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు. చేవెళ్లలో కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప యాదయ్య చేసిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి తదితర సంక్షేమ పథకాలు పేదలకు కాకుండా బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇచ్చారని ఆరోపించారు. ఇకనుంచి ఆయన ఆటలు సాగవని, యాదయ్యపై ప్రతీకారం తీర్చుకునేందుకు, కుటుంబ పాలనకు చరమగీతం పాడేందుకు కాంగ్రెస్ దండు కదిలివస్తోందని స్పష్టం చేశారు. పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

**స్థానిక నేతల కృషితోనే టికెట్**

చేవెళ్ల టికెట్ స్థానికులకే ఇవ్వాలని గత కొన్నాళ్లుగా స్థానిక నేతలు ఎంతో కృషి చేశారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తానని చెప్పారు. తనకు తల్లి సమానులైన లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆశీస్సులతో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. స్థానిక సమస్యలపై తనకు పూర్తిగా అవగాహన ఉందని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేయబోసే ఆరు గ్యారంటీ స్కీమ్‌ల గురించి ప్రతి గడపకు వెళ్లి వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ చైర్మన్ చింపుల సత్యనారాయణ రెడ్డి, మండలాల అధ్యక్షులు వెంకటయ్య, వీరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పడాల ప్రభాకర్, మధుసూదన్ గుప్తా, సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, బండారు ఆగిరెడ్డి, పాండు, మల్లేశ్, పెంటయ్యగౌడ్, శ్రీనివాస్ గౌడ్, మద్దెల శ్రీను, మంగలి నర్సింలు పాల్గొన్నారు.





# నిరుద్యోగులను లైట్ తీసుకున్నడు!

**మొదటిపేజీ తరువాయి**

హామీలు ప్రకటించినా.. అవి వెంటనే అమల్లోకి వచ్చేది అనుమానంగానే కనిపిస్తుంది.

**బీఆర్ఎస్ కీలక హామీలివే..**

కేసీఆర్ బీమా - ప్రతి ఇంటికి ధీమా తెలంగాణ రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి పేద ఇంటికి రైతు బీమా తరహాలోనే ఎల్ఐసీ ద్వారా రూ.5లక్షల జీవిత బీమా. దీనిద్వారా దాదాపు 93 లక్షల కుటుంబాలకు లబ్ది. ఆసరా పింఛను రూ.5,016కి పెంపు. ప్రస్తుతం రూ.2,016 ఇస్తుండగా.. తొలి సంవత్సరంలో రూ.3,016కు పెంచుతారు. ఏటా రూ.500ల చొప్పున ఐదేళ్లలో రూ.5,016 ఇస్తారు. దివ్యాంగులకు పింఛను రూ.6వేలకు పెంపు. దివ్యాంగుల పింఛను తొలి ఏడాది రూ.5వేలకు పెంపు. ఏటా రూ.300ల చొప్పున పెంపు. ఆరోగ్యశ్రీ గరిష్ఠ పరిమితి ₹15లక్షలకు పెంపు. సౌభాగ్యలక్ష్మి పథకం కింద అర్హులైన పేద మహిళలకు ప్రతి నెల రూ.3వేలు చొప్పున భృతి చెల్లింపు. అర్హులైన పేదలతో పాటు అక్రిడేషన్ ఉన్న ప్రతి జర్నలిస్టులకు రూ.400కే గ్యాస్ సిలిండర్. ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు కేసీఆర్ ఆరోగ్య రక్ష పేరుతో రూ.15లక్షల వరకు ఆరోగ్య బీమా. రైతు బంధు సాయం మొత్తాన్ని రూ.16వేలకు దశల వారీగా పెంచుతాం. తొలి ఏడాది సాయాన్ని రూ.12వేల వరకు పెంపు. 'తెలంగాణ అన్నపూర్ణ' పథకం ద్వారా తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు సన్నబియ్యం అందజేత. అగ్రవర్ణాల కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక గురుకుల పాఠశాల. మహిళా సంఘాలకు స్వశక్తి భవనాలు. రాష్ట్రంలో అనాథల కోసం ప్రత్యేక పాలసీ. ప్రభుత్వ ఉద్యోగుల ఓపీఎస్ కోసం కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

**అమలు సాధ్యమేనా?**

2022 అక్టోబర్ నాటికి తెలంగాణ అప్పు రూ.4.33 లక్షల కోట్లకు చేరుకుందని పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. రాష్ట్రం ఏర్పడినప్పుడు తెలంగాణ అప్పు రూ.75,577 కోట్లుగా మాత్రమే ఉంది. ఆ తర్వాత ప్రతీ ఏటా అప్పు పెరుగుతూనే వస్తోంది. 202122 నాటికి రూ.2.83 లక్షల కోట్లకు అప్పు చేరుకోగా.. 2022 అక్టోబర్‌కు రూ.4 లక్షల కోట్లకు చేరుకుందని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన రాష్ట్రాన్ని గత 9 ఏళ్లల్లో అప్పుల రాష్ట్రంగా కేసీఆర్ మార్చారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పులు ఇలాగే పెరిగితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ముప్పు పొంచి ఉందనే ప్రమాదం ఉంటుదని కేంద్రం హెచ్చరిస్తోంది. ఇదిలా ఉండగా.. తాజాగా కేసీఆర్ ప్రకటించిన వరాల అమలుకు రాష్ట్రం మరింత అప్పు చేయక తప్పదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఓట్ల కోసం సాధ్యం కాని హామీలు ఇవ్వడం వల్ల ప్రజలపైనే భారం పడుతుందని అంటున్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రకటించిన క్రమంలో ఈ చర్చ మరోసారి తెరపైకి వస్తోంది. అసలు వీటిని అమలు చేయడం సాధ్యమేనా? అనే చర్చ జరుగుతోంది.



**కెసిఆర్ ను ఓడిస్తాం**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయని పోరాడిన సాధించిన రాష్ట్రంలో ఉద్యోగాలు లేక నిత్యం నిరుద్యోగులు చస్తున్నాం కెసిఆర్ ప్రభుత్యం పట్టించుకోవట్లేదు. తాజాగా ప్రకటించిన మ్యానిఫెస్టో లో నిరుద్యోగ అంశంలేకపోవడం అత్యంత దుర్మార్గపు చర్య. నిరుద్యోగ వ్యతిరేక కెసిఆర్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడిస్తాం

- కంచనపల్లి శ్రీను, నిరుద్యోగి

# హస్తం గూటికి రేఖా నాయక్

**విశాలభారతి,హైదరాబాద్:**

ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ హస్తం పార్టీలో చేరేందుకు ముహూర్తం ఖరారైంది. బీఆర్ఎస్ నుంచి మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావించగా అధిష్టానం నిరాకరించడంతో నిరాశ చెందారు. అంతలోనే పార్టీకి గుడ్ బై చెప్పారు. ఈ క్రమంలోనే రేఖా నాయక్ ఏ పార్టీలోకి వెళ్తారా? ఇండిపెంటెండ్‌గా పోటీ చేస్తారా? ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు తన భార్త శ్యాం నాయక్ ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. ఆసిఫాబాద్ నుంచి ఇప్పటికే శ్యాం నాయక్ ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయన కూడా ఆ స్థానం నుంచి పోటీ చేయాలని గట్టిగా నిర్ణయించుకున్నారు. ఇప్పుడు రేఖా నాయక్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రెడీ అయ్యారు. కాంగ్రెస్‌లో చేరితే టికెట్ ఎవరికి దక్కుతుందనే స్థానికంగా చర్చ మొదలైంది. ఈ నెల 18న హస్తం పార్టీలో చేరుతున్నట్లు జన్నారంలో రేఖానాయక్ కార్యకర్తలకు క్లారిటీ ఇచ్చారు.






# భారత్-పాక్ మ్యాచ్ కు రికార్డు వ్యూవర్ షిప్

వరల్డ్ కప్ టోర్నీలో భాగంగా అహ్మదాబాద్ లో జరిగిన ఇండియా వర్సెస్ పాకిస్థాన్ మ్యాచు రికార్డు స్థాయిలో వీక్షకులు చూశారు. కేవలం ఓటీటీ ప్లాట్ ఫార్మ్ అయిన డిస్నీ+ హాట్‌స్టార్‌లో ఈ మ్యాచ్ కోసం లైవ్ స్ట్రీమ్ సమయంలో అత్యధికంగా మూడున్నర కోట్ల మంది వీక్షించారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని క్రికెట్ మ్యాచుల కన్నా తాజాగా జరిగిన మ్యాచుకే రికార్డు స్థాయిలో వీక్షకుల సంఖ్య 3.5 కోట్లకు చేరుకుంది. దీంతో ఈ ఏడాది ప్రారంభంలో చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన ఐపిఎల్ ఫైనల్‌లో 3.2 కోట్ల మంది వీక్షకులు చూడగా.. ఇప్పుడు ఆ రికార్డు బ్రేక్ అయ్యింది. ఈ మ్యాచ్‌ని స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ లో, డిస్నీ స్టార్ ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్‌ను ప్రముఖ మల్టీప్లెక్స్ ఆపరేటర్ PVR INOX సినిమా హాళ్లలో కూడా ప్రదర్శించింది. అక్కడ మ్యాచ్‌ని చూడటానికి పెద్ద సంఖ్యలో సందర్శకులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# 70 సీట్లు గెలవబోతున్నాం

**విశాలభారతి, హైదరాబాద్:**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాల్లో విజయం సాధించి కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతోందన్నారు కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెంకట్ రెడ్డి. టికెట్ రాలేదని ఎవరూ బాధపడొద్దని నిజాయితీగా కాంగ్రెస్ జెండా మోసిన ప్రతి ఒక్కరికా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా పదవులు ఉంటాయని వాటిలో టికెట్ రానివారిని సర్దుబాటు చేస్తామన్నారు.

పొన్నాల లక్ష్మయ్యను డాలర్ లక్ష్మయ్య అని పిలిచేవారని కాంగ్రెస్ వల్లే ఆయనకు గుర్తింపు వచ్చిందని గుర్తు చేసారు కోమటిరెడ్డి. అలాంటి వ్యక్తి పార్టీ మారడం బాధకలిగించిందని అభిప్రాయపడ్డారు. అయితే పార్టీ మారడం తప్పుకాదు కానీ... వెళ్లిపోయేటప్పుడు పార్టీపై పార్టీ నాయకత్వంపై నిందలు వేయడం సరికాదని అన్నారు. టికెట్లు ఇచ్చేది పీసీసీ చీఫ్ కాదని ఆయన్ని తిడితే అధిష్ఠానాన్ని తిట్టినట్టేనన్నారు. ఆయన కేవలం కోఆర్డినేటర్ మాత్రమేనని.. టికెట్ల వ్యవహారమంతా అధినాయకత్వం చూసుకుంటుందని చెప్పారు. పొన్నాల పార్టీలో ఉండి ఉంటే విజయం సాధించిన తర్వాత రాజ్యసభ సీటు వచ్చేదేమో అన్నారు.

ఇప్పటికి ప్రకటించిన మొదటి జాబితాలో బీసీలకు 12, జనరల్ 26 సీట్లు, మైనారిటీలకు 3 సీట్లు ఇచ్చామని తెలిపారు కోమటి రెడ్డి. బీసీలకు 12 వచ్చాయి. తర్వాత జాబితాలో కూడా వస్తాయి బీసీలకు తగిన గుర్తింపు ఉంటుందని కచ్చితంగా కేసీఆర్ కంటే నాలుగు సీట్లు అధికంగానే ఇస్తామన్నారు.

టికెట్స్ రానివారు ఎలాంటి నిరాస లేకుండా ప్రభుత్వం ఏర్పాటు దిశగా ప్రయత్నాలు చేయాలన్నారు కోమటి రెడ్డి. కాంగ్రెస్ పార్టీ విజయం కోసమే అందరూ కలిసి పని చేయాలని సూచించారు. ఎన్ని కేసులు పెట్టినా సరే కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారని అలాంటి వారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు.

టికెట్ రానివాళ్లూ వచ్చినవారితోపాటు కలిసి పనిచేయాలని హితవుపలికారు కోమటిరెడ్డి. సామాజిక సమీకరణాలు చూసి టిక్కెట్లు ఇస్తారని... కష్టపడి జెండాలు మోసిన అందరికీ పదవులు దక్కుతాయన్నారు. లెఫ్ట్ పార్టీలతో పొత్తు కారణంగా తమకూ నష్టమేనన్నారు కోమటిరెడ్డి. మిర్యాలగూడ వామపక్షాలు అడుగుతున్నాయని.. అది కాంగ్రెస్ కచ్చితంగా గెలిచే సీటని తెలిపారు. మునుగోడు ఇస్తామంటే వాళ్లు మాత్రం కొత్తగూడెం కోసం పట్టుబడుతున్నారని వివరించారు. జాతీయస్థాయిలో ప్రయోజనాలు చూసుకుని అధిష్టానం నిర్ణయం తీసుకుందని దాన్ని అంతా గౌరవించాలన్నారు.



బీఆర్ఎస్ పాలనలో ఉపాధ్యాయులు లేక ప్రభుత్వ స్కూళ్లు మూతపడ్డాయని విమర్శించారు కోమటి రెడ్డి. డీఎస్సీ నియామకాలు లేవన్నారు. అందుకే స్కూళ్లకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్, ఆరోగ్య శ్రీ సరిగా అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రవళిక అనే అమ్మాయి పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల కోసం ప్రిపేర్ అయి, పరీక్షలు రద్దు కావడం వల్ల ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. కోడ్ వచ్చే ముందు నోటిఫికేన్లు ఇస్తారని... కోడ్ కారణంగా అవి వాయిదా పడతాయని ఎప్పుడూ ఇది జరిగేదని ఎద్దేవా చేశారు.

కార్ కావాలా బేకార్ గాండ్లు కావాలా అన్న మాటలను తీవ్రంగా కోమటిరెడ్డి తీవ్రంగా ఖండించారు. గ్యారంటీ, వారంటీ తీరిపోయింది అంటున్న వాళ్లు... పదేళ్లలో అందరికీ పదవులు ఇస్తా డొక్కు కార్ ఎక్కించుకున్నారని ఎద్దేవా చేశారు. అది ముక్కలు అవడం ఖాయమని అభిప్రాయపడ్డారు. కేసీఆర్ లేకపోతే బీఆర్ఎస్ ముక్కలు అవుతుందని విమర్శించారు. కవితకు ఒకటి, కేటీఆర్‌కి ఒకటి, హరీశ్‌కి ఒకటి చీలికలు ఏర్పడతాయన్నారు.

దేశపతి శ్రీనివాస్ కొటేషన్లు రాసిస్తే కేసీఆర్, కేటీఆర్ మాట్లాడుతున్నారని...రామలింగ రాజు, ఆయన కొడుకు తేజ రాజు చెప్పినట్టు కేటీఆర్ నడుచుకుంటారని ఆరోపించారు. తెలంగాణలో ధర్నాలు చేస్తానంటే ఎందుకు అడ్డుకుంటున్నావని ప్రశ్నించారు. ఐటీ ఉద్యోగుల మీద పోలీస్ కేసులు పెడుతున్నారెందుకని నిలదీశారు. ధర్నా చేసేవారిలో కమ్మ వారు మాత్రమే కాదు, అందరూ ఉన్నారని తెలిపారు.



## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

**ఆమనగల్లు, విశాల భారతి:**బిజెపి నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామనిమాజీ జడ్పిటిసి కండె హరిప్రసాద్ అన్నారు. శనివారం కల్వకుర్తి నియోజకవర్గంలోని కడ్తాల్ మండలం గానుగుమార్ల తాండ గ్రామానికి చెందిన బి ఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యులు బాణావత్ శంకర్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బిఆర్ఎస్ ఖాళీ అవుతుందని, బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కల్వకుర్తి నియోజకవర్గంలోని ఇతర పార్టీల నుండి బిజెపిలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మాన్య నాయక్,సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి , రమేష్ అయ్యగారు , లక్ష్మణ్ నాయక్ ,కుమార్, రాజు నాయక్, మునిష్ నాయక్ , నాగార్జున్ , వెంకటేష్ , రాజేష్ ,నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి



**ఆమనగల్లు, విశాల భారతి** :మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను కడ్తాల్ మండల అధ్యక్షుడు బీచ్యా నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం దేశానికి చేసిన సెవలను గుర్తు చేసుకుంటూ వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్ మాట్లాడుతూ కడుపేద కుటుంబంలో పుట్టి అనేక బాధలను అనుభవించి దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తగా పని చేయడమే కాకుండా దేశంలోనే అత్యంత ముఖ్యమైన పదవి అయిన రాష్ట్రపతి పదవిని అలంకరించిన గొప్ప దార్శనికుడు కలామ్ అని అన్నారు. దేశానికే ఖ్యాతి గడించిన మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలామ్ ఆజాద్ కొనియాడారు. అబ్దుల్ కలాం ఆజాద్ జీవితం,దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం మండల పరిధిలో ఉన్న బటర్ ఫ్లై సిటీ వెంచర్ల వివిధ కాలనీలో నివాసముంటున్న వారందరికీ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీ స్కీములను, వివిధ డిక్లరేషన్ల గురించి వివరించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు జంగీర్ బాబా, టౌన్ వర్కింగ్ అధ్యక్షుడు రాంచందర్ నాయక్, సేవాధల్ అధ్యక్షుడు లక్ష్మయ్య, ఏస్సీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు సత్యం యాదవ్, భాస్కర్ రెడ్డి, చెందోజి, జాంగీర్, భిక్కు నాయక్, ఆజ్గార్ అలి, యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు భానుకిరణ్, రాజేందర్ గౌడ్, రామకృష్ణ, రాజేష్, ప్రవీణ్ గౌడ్, భరత్ యాదవ్, రమేష్, నరేష్, మూన్య నాయక్, శ్రీకాంత్, శ్రీను . నేజ్య నాయక్. మెగ్య. రాజు. మున్య, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్మూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా వినయ్ కుమార్ రెడ్డి

**ఆర్మూర్, విశాల భారతి:**ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదివారం ఖరారు చేసింది. వినయ్ రెడ్డి 2018లో బిజెపి పార్టీ నుంచి పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. మొదటి లిస్టులోనే అభ్యర్థితత్వం ఖరారు కావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో గెలిచి సేవ చేస్తా అని ధీమావ్యక్తం చేశారు.



## సీఎం సభకు తరలిన బిఆర్ఎస్ శ్రేణులు

**సైదాపూర్, విశాల భారతి:**ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆదివారం హుస్నాబాద్ బహిరంగ సభకు రావడంతో మండలం నుండి బిఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా మంత్రి సోమారం సర్పంచ్ పైడిమల్ల సుశీల తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ లోని భారీ బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో సోమరం బుడిదిపల్లి గర్రపల్లి బిఆర్ఎస్ పార్టీ నాయకులు సోమరం సర్పంచ్ అధ్వర్యంలో దాదాపు 500 మంది సీఎం సభకు తరలి వెళ్లారు. సభకు వెళ్లిన వారిలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పెరమాండ్ల సురేష్ గౌడ్, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ పైడిమల్ల తిరుపతి గౌడ్ , ఏనమల రమేష్ సింగల్ విండో డైరెక్టర్లు గడ్డం అబ్బయ్య, మోహన్ రావు, పైడిమల్ల కుమారస్వామి, పాకాల రమేష్ గౌడ్, దోకిడి తిరుపతి, మోకిడి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



## హ్యాట్రిక్ సీఎం కేసీఆర్

- కల్వకుర్తి ఎమ్మెల్యేగా జైపాల్ యాదవ్ విజయం ఖాయం
- బిజెపి, కాంగ్రెస్ డిపాజిట్లు గల్లంతు

**ఆమనగల్లు, విశాల భారతి:**ప్రజల ఆశీర్వాదంతో కేసీఆర్ హైట్రిక్ సీఎం అవుతారని ఆమనగల్లు జడ్పిటిసి అనురాధ పత్య నాయక్ చెప్పారు. శనివారం ఆమనగల్లు పట్టణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని, అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తిలో బిఆర్ఎస్ జెండా మరోసారి ఎగడం ఖాయమని, బిజెపి, కాంగ్రెస్ డిపాజిట్ల కోసం పోటీ పడుతున్నాయని విమర్శించారు. మరో 10 ఏళ్లపాటు తెలంగాణలో ఎగిరేది బిఆర్ఎస్ జండా అని, కల్వకుర్తి ఎమ్మెల్యేగా జైపాల్ యాదవ్ విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అప్పం శీను, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి, బిఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ అధ్యక్షులు వడ్డె వెంకటేష్, బిఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు రమేష్ నాయక్, పూసల భాస్కర్, మాజీ వార్డు సభ్యులు సాయిలు,మల్లేష్ నాయక్, జంతుక అల్లాజీ, జంగయ్య, ఆనంద్, గణేష్, శేఖర్ దేవేందర్, చంటి,మహేష్ రాంబాబు యాదగిరి, మహేష్, గణేష్,శ్రీను, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీ ఫామ్ అందుకున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



**ఆమనగల్లు, విశాల భారతి:**కల్వకుర్తి నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే జైపాల్ యాదవ్.. ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా బీఫామ్ అందుకున్నారు. ఆదివారం తెలంగాణ భవన్ లో ముఖ్యమంత్రి కెసిఆర్ బిఆర్ఎస్ అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు దిశా నిర్దేశం చేసి బీఫామ్ ను అందించి ఎన్నికల ప్రచారంలో ముందుండాలని సూచించారు. నియోజకవర్గంలో పర్యటించి ప్రతి కార్యకర్తను కలవాలని సూచించారు.



## సీఎం కేసీఆర్ సభకు కొండాపూర్ ప్రజల పాదయాత్ర

- -జెండా ఊపి ప్రారంభించిన ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి

**చిగురుమామిడి, విశాల భారతి:**సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామం నుండి సర్పంచ్ పెద్దపల్లి భవాని అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో దాదాపు 12వందల మంది గ్రామస్తులు పాదయాత్రగా బహిరంగ సభకు చేరుకున్నారు. ఈ పాదయాత్రను ఎంపీపీ కొత్త వినీత రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్ మీద ఉన్న అభిమానంతో ప్రతి గడప నుండి పిల్లా జెల్లాతో బహిరంగ సభకు తరలి వెళ్లినట్లు చెప్పారు. పేద బడుగు బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్న సీఎం కేసీఆర్ ను, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్ హైట్రిక్ విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మామిడి అంజయ్య, స్థానిక సర్పంచ్ పెద్దపల్లి భవాని అరుణ్ కుమార్ పటేల్, కొండాపూర్ గ్రామ ఇంచార్జ్ ఎంపీటీసీ మిట్టపల్లి మల్లేశం, సీనియర్ నాయకులు పెద్దపల్లి రవీందర్ పటేల్,సింగిల్ విండో డైరెక్టర్ పోతరవేని శ్రీనివాస్ యాదవ్,గ్రామశాఖ మహిళ ఉపఅధ్యక్షురాలు పిల్లి శోభ రాణి,బింగి లక్ష్మీనారాయణ,చీకుట్ల సదయ్య,చీకుట్ల రాజు,కాశీం,కమల్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డిని అభినందించిన వంశీ

**ఆమనగల్లు, విశాల భారతి** :కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపికైన కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆదివారం ఏఐసీసీ కార్యదర్శి వంశీ చందర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా అభ్యర్థిగా ఎంపికైన ఆయనను పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీమాట్లాడుతూ.. అభ్యర్థిగా ప్రకటించిన జాతీయ కాంగ్రెస్, రాష్ట్ర కాంగ్రెస్ అధిష్టానానికి నాయకులకుఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## వైయస్సార్టీపీ నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా జగటి కల్పన దరఖాస్తు

**బెల్లంపల్లి, విశాల భారతి:**హైదరాబాదులోని లోటస్ పాండ్ లో వైయస్సార్ తెలంగాణ పార్టీ కార్యాలయంలో బెల్లంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా జాగటి కల్పన దరఖాస్తు చేసుకున్నారు. ఆమె మాట్లాడుతు వైస్సార్ తెలంగాణ పార్టీ మంచిర్యాల జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కొనసాగుతు అనేక కార్యక్రమాల్లో పాలు పంచుకొని వైయస్సార్ తెలంగాణ పార్టీ బలోపేతం చేయడానికి ఎంతగానో కృషి చేసానని అన్నారు. అవకాశం ఇస్తే బెల్లంపల్లిలో వై. ఎస్. ఆర్ పార్టీని అధికారం లోకి తెస్తా అని వారు అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్ చేతుల మిదగా ధరకస్తూ ఫారాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రచార జయభేరి నేడే ప్రారంభం

- కేవలం ఎన్నికల కోసం మాత్రమే కాంగ్రెస్, బిజెపి పార్టీల మ్యానిఫెస్టోలు



**ఆమనగల్లు, విశాల భారతి** :కనీవినీ ఎరుగని రీతిలో నాభూతో నా భవిష్యత్తు అనే విధంగా దేశంలో, రాష్ట్రంలో ఏ పార్టీ ఇలాంటి ఎన్నికల ప్రణాళికను ప్రకటించలేదు. కేవలం కెసిఆర్ మాత్రమే అనునిత్యం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆయన ఆలోచనా విధానం వుంటుంది. కాబట్టే ఇలాంటి ప్రణాళికను ప్రకటించారని కల్వకుర్తి నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలకు నూకలు చెల్లాయి అని గుర్తుంచుకోవాలని ఎద్దేవా చేశారు. అదే విధంగా కల్వకుర్తి నియోజకవర్గంలో బిఆర్ఎస్ పటిష్టంగా ఉందని, ముచ్చటగా కెసిఆర్ మూడో సారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం కాయమని అన్నారు. అనంతరం కల్వకుర్తి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ప్రచార జయభేరి కడ్తాల్ మండల పరిధిలోని అన్మాస్ పల్లిలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం కడ్తాల్ మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్లో ఏర్పాటుచేసిన నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించబడును కావున ప్రజా ప్రతినిధులు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు సబ్బండ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్ రెడ్డికి బీఫారం

- ఆర్మూర్ నియోజకవర్గ ప్రజల హర్షా తిరేకాలు
- కేసీఆర్ కుజీవన్ రెడ్డి పాదాభివందనం



**ఆర్మూర్, విశాల భారతి:**ఆర్మూర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిత్వం ఇప్పటికే ఖరారైన జీవన్ రెడ్డికి ఆదివారం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ బీఫారం అందజేశారు. జీవన్ రెడ్డి బీఫారం తీసుకోవడంతో ఆర్మూర్ నియోజక వర్గ ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. గులాబీ శ్రేణుల సంబురాలు నియోజకవర్గ వ్యాప్తంగా మిన్నంటాయి. ఆర్మూర్ స్థానం నుంచి మళ్లీ జీవన్ రెడ్డి అభ్యర్థిత్వం ఖరారు కావడంతో ఆయన హ్యాట్రిక్ విజయంపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. ఇప్పటికే జీవన్ రెడ్డి రెండు,మూడు పర్యాయాలు నియోజకవర్గమంతా కలియతిరిగి బీఆర్ఎస్ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేశారు. బూత్ ల వారీగా పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లి ప్రజల్లో చర్చపెట్టాలని దిశానిర్దేశం కూడా చేశారు. ఇప్పటికే ప్రజా ఆశీర్వాద యాత్ర పేరుతో గ్రామగ్రామాన ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గత పదేళ్లుగా అన్నివర్గాల ప్రజలకు అత్యంత ఆత్మీయనేతగా పేరు తెచ్చుకున్న జీవన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమంలో ఆర్మూర్ నియోజకవర్గాన్ని కొత్త పుంతలు తొక్కించారు.

**రాజకీయ ప్రస్థానం:**

కేసీఆర్ నాయకత్వంలో జరిగిన మలి విడత తెలంగాణ ఉద్యమంలో జీవన్ రెడ్డి కీలకపాత్ర వహించారు. అనేక ఉద్యమాలలో పాల్గొని జైళ్ల పాలయ్యారు. బకాయిల కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడుతున్న ఎర్ర జొన్న రైతులకు బాసటగా నిలిచిన జీవన్ రెడ్డి రైతులకు మద్దతుగా నిరాహారదీక్ష చేశారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులచే కాల్పులు జరిపించినా భయపడకుండా పోరాడిన చరిత్ర జీవన్ రెడ్డికి ఉంది. స్వరాష్ట్రం వచ్చిన తరువాత కేసీఆర్ తో మాట్లాడి ఎర్రజొన్న రైతులకు బకాయిలు ఇప్పించారు. ఉద్యమ కాలంలో జీవన్‌రెడ్డికి బిఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడుగా, ఆర్మూర్ నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జిగా పని చేసిన అనుభవం ఉంది. 2014లో స్వరాష్ట్రంలో జరిగిన మొట్టమొదటి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ తరపున ఆర్మూర్ శాసనసభ నియోజకవర్గం నుంచి పార్టీ తొలి టికెట్ పొందిన ఉద్యమ నేతగా జీవన్ రెడ్డి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. కేసీఆర్ ఆశీస్సులతో ఆర్మూర్ అసెంబ్లీ స్థానం నుంచి తొలిసారి ఎన్నికల బరిలోకి దిగిన జీవన్ రెడ్డి భారత జాతీయ కాంగ్రెస్ అభ్యర్థి కేతిరెడ్డి సురేష్‌రెడ్డిపై 13,964 ఓట్ల మెజారిటీతో గెలిచారు. 2018లో జరిగిన తెలంగాణ ముందస్తు ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ టికెట్ పై పోటీచేసి సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆకుల లలిత పై 28,795 ఓట్ల మెజారిటీతో రెండోసారి గెలుపొంది అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. తెలంగాణ రాష్ట్ర సమితి తరపున ప్రధాన వక్తగా, తెలంగాణ ప్రభుత్వం తరపున అనేక వార్తా ఛానళ్ళలో ప్రత్యక్ష చర్చల్లో పాల్గొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ కి అత్యంత విశ్వాస పాత్రుడిగా పేరు తెచ్చుకున్నారు. జీవన్ రెడ్డి సమర్థతను గుర్తించిన సీఎం కేసీఆర్ ఆయనను తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థల కమిటీ (పీయూసీ) చైర్మన్‌గా నియమించగా 2019 అక్టోబరు 31న పదవీ బాధ్యతలు స్వీకరించారు. 26 జనవరి 2022న బీఆర్ఎస్ పార్టీ నిజామాబాదు జిల్లా అధ్యక్షుడిగా జీవన్ నియమితుడై ప్రస్తుతం ఆ పదవిలో కొనసాగుతున్నారు.



## హ్యాట్రిక్ ఎమ్మెల్యే చిన్నయ్య

- బెల్లంపల్లిలో బిఆర్ఎస్ కు తిరుగు లేదు

**బెల్లంపల్లి, విశాల భారతి:**తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి తెలంగాణ పార్టీ మేనిఫెస్టో విడుదల చేయడం జరిగింది. ముఖ్యమంత్రి కార్మికులకు కర్షకులకు వికలాంగులకు పెన్షన్ దారులు అందరికీ గణనీయమైన పెన్షన్ పెంచడం జరిగిందని.. 3000 పెన్షన్ దారులకు 5000, వికలాంగులకు 6000, రైతుబంధు 16,000, ఇవన్నీ పథకాలు ఇచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నాయకత్వంలో అందరు కూడా కలిసికట్టుగా పనిచేసి బిఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గెల్లి రాజలింగు కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ఏదైతే మేనిఫెస్టో విడుదల చేశారొ దానిలో భాగంగానే బెల్లంపల్లి పట్టణం లోని టీబీజీకేఎస్ ఆఫీసు ఎదురుగా చైర్మన్ కౌన్సిలర్స్ బిఆర్ఎస్ నాయకులతొ సంబరాలు చేసుకున్నారు. నిరుపేదల ఆరోగ్యం పై శ్రద్ధ చూపించి వారందరికీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు రెండు లక్షల రూపాయల ఆరోగ్యశ్రీ కింద లక్షల రూపాయలు ఉండేవి ఇప్పుడు దానిని 15 లక్షలకు పెంచినటువంటి ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని అన్నారు. గ్యాస్ ధరను కూడా 400కు తగ్గిస్తామని చెప్పి ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జక్కుల శ్వేత శ్రీధర్,వైస్ చైర్మన్ బత్తుల సుదర్షన్ గెల్లి రాజలింగు, షేక్ అప్సర్, రాములు నాయక్, సముద్రాల లావణ్య,షేక్ ఆస్మా, కెమిశెట్టి సరిత శ్రీనివాస్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్నూనెటి సత్యనారాయణ,బిఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులుబడికెల శ్రావణ్, బిఆరెస్ వై పట్టణ అధ్యక్షులు సన్నిబాబు, బి ఆర్ ఎస్ వి పట్టణ అధ్యక్షులు యునుస్, పట్టణ అధికార ప్రతినిధికాసర్ల యాదగిరి, బిఆరెస్ నాయకులు చిట్టాల మధు, ఎలిగేటి శ్రీనివాస్, పోలు శ్రీనివాస్, సూరం భానేష్, కుంభాల రాజేష్, కాంపెల్లి రాజం, పైడిమల్ల చంద్ర శేఖర్, మద్దెల గోపి, మునీర్, పట్నం చక్రధర్, కలీల్,గద్దల ధర్మేంధర్,తదితరులు పాల్గొన్నారు

## కోలాటం మహిళలకు చీరల పంపిణీ



**చిట్యాల, విశాలభారతి:**చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతటి పారిజాత నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో కోలాటం ఆడే మహిళలకు సుమారు 25 మందికి చీరల పంపిణీ చేయడం జరిగింది. మహిళలు సద్దుల బతుకమ్మ, దసరా పండుగని ఘనంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సుర్కంటి సత్తిరెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బొంతల అంజి రెడ్డి, ఆంజనేయస్వామి మాజీ చైర్మన్ కొంపెల్లి వెంకట్ రెడ్డి, గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు చీమల వీరేశం,నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బీఆర్ఎస్ గెలుపు చారిత్రక అవసరం

- గౌరవెల్లి ప్రాజెక్టును ఎన్నికల తర్వాత ప్రారంభించి హుస్నాబాద్ ను సస్యశ్యామలం చేస్తా
- హుస్నాబాద్ నా లక్షి నియోజకవర్గం మూడవసారి ఇక్కడి నుండే ప్రచారం ప్రారంభిస్తున్న దీవించండి



**చిగురుమామిడి, విశాలా భారతి:** గులాబీమయమైన హుస్నాబాద్, వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, హుస్నాబాద్ ప్రజా ఆశీర్వాద సభ అంచనాలకు మించి విజయవంతమైంది. నిన్న హుస్నాబాద్ గడ్డమీద ప్రజా ఆశీర్వాద సభ, మొట్టమొదటి కేసిఆర్ ఎన్నికల ప్రచార బహిరంగ సభ జరిగింది. వేలాదిగా తరలివచ్చిన మహిళలు, యువకులు, ప్రజల కోలాటాలు, డప్పు చప్పుళ్ళు, బతుకమ్మలతో, వివిధ కుల వృత్తుల వేషధారణలతో, లంబాడి మహిళల నృత్యాలతో సందడిగా ప్రజా ఆశీర్వాద సభ జై కేసీఆర్, జై సతీష్ కుమార్ నినాదాలతో మారు మ్రోగింది. హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ అతిథులందరికీ స్వాగతం సుస్వాగతం తెలియజేస్తూ తనపై అభిమానంతో హుస్నాబాద్ నియోజకవర్గ నలుమూలల నుండి వచ్చిన ప్రజానీకానికి పేరుపేరునా అక్కాచెల్లెళ్లకు, అన్నదమ్ములకు, యువకులకు బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు అందరికీ కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు. కేసిఆర్ ఆశీర్వాదంతో మంత్రి హరీష్ రావు, కేటీఆర్ ల సహకారంతో తొమ్మిదిన్నర సంవత్సరాల నుండి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి సంక్షేమంలో తొమ్మిది వేల కోట్లతో అభివృద్ధి చేశానని మరొకసారి హుస్నాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్న ఆశీర్వదించండి అని కోరారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ వినోద్ కుమార్ మాట్లాడుతూ హైదరాబాదులో మేనిఫెస్టో విడుదల చేసి కేసిఆర్ హుస్నాబాద్ ప్రజల ఆశీర్వాదం కోసం వచ్చారని గత రెండు పర్యాయాలు ఆశీర్వదించారు. మూడవసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, కేసిఆర్ ని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్ నీ ఆశీర్వదించాలని కోరారు. మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ గత ఎన్నికలలో 88 సీట్లు వచ్చాయి. ఈసారి తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో 100 పైచీలకు సీట్లు వస్తాయని నమ్మకాన్ని వెలిబుచ్చారు. హుస్నాబాద్ ప్రజలంటే కేసిఆర్ కు ప్రేమ నమ్మకం గురి ఈ మట్టికి మహిమ ఉందని, హుస్నాబాద్ ఎల్లమ్మ తల్లి దయ తెలంగాణ ప్రజలందరికీ ఉందని మరొకసారి బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టం కట్టాలని అన్నారు. నిజమైన నాయకుడు సౌమ్యుడు అందరికీ అందుబాటులో ఉండే సతీష్ కుమార్ ను మరొకసారి గెలిపించాలని అన్నారు. సీఎం కేసీఆర్ మాట్లాడుతూ 2018 శాసనసభ ఎన్నికల ప్రచారాన్ని హుస్నాబాద్ నుండి ప్రారంభించి 88 సీట్లతో అఖండమైన విజయాన్ని సాధించామని హుస్నాబాద్ నుంచి జైత్రయాత్ర అలాగే కొనసాగాలని మూడోసారి 100 పైచిలుకు సీట్లు సాధించాలని ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. ఎలక్షన్ రాగానే ఎంతోమంది వస్తారు వాళ్ళ మాటలన్నీ పట్టించుకోవద్దు రాయేందో, రత్నమేందో గుర్తుపట్టాలని మన ఓటు మన తల రాతను, మన తాలూకా రాతను, జిల్లా రాతను మారుస్తుందని ప్రజల ఓటు గెలవాలి వారి ఆకాంక్షలు నెరవేరాలని అన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమం కోసం దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. పెన్షన్లు విధి వంచితులకు భరోసాగా ఇస్తున్నామని వారిని సమాజం కాపాడుకోవాలని అందుకోసమే పెన్షన్లు 5000 చేస్తున్నానని అన్నారు. మహాసముద్రం గండిని పూడ్చడం ద్వారా హుస్నాబాద్ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగాయని ఇక్కడి మిత్రుడు కవ్వ లక్ష్మారెడ్డి స్వయంగా నన్ను తీసుకువెళ్లి చూయించి కెప్టెన్ సహకారంతో పూర్తి చేశామని అన్నారు. మీ ఆశీర్వాదం కోసం వచ్చా.. రైతుల, పేదల, సంక్షేమ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రకటించాను 2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 95 స్థానాలు నుండి 105 స్థానాల వరకు గెలుస్తాదనే ధీమాను కేసిఆర్ వ్యక్తం చేశారు.

## శాంతియుతంగా ధర్నా చేస్తున్నపాత్రికేయులపై బాల్క సుమన్ అనుచరుల దాడిని ఖండించండి

**మంచిర్యాల, విశాల భారతి:** డి జె ఎఫ్ పాత్రికేయ మిత్రులారా నిన్నగాక మొన్న మందమర్రిలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరు శాసనసభ్యులు బాల్క సుమన్ విలేకరుల పట్ల చులకన భావంతో మాట్లాడుతూ వంకర టింకర వార్తలు రాసే వాళ్లను సరి చేయండి అంటూ చేసిన సంభాషణను నిరసిస్తూ శాంతియుతంగా క్యాతంపల్లి ఎక్స్ రోడ్డు వద్ద నిర్వహిస్తున్న విలేకరులపై బాల్క సుమన్ అనుచరులు దాడులకు పాల్పడడం అత్యంత నీచమైన చర్యగా డి జె ఎఫ్ ఖండిస్తున్నది. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా చెన్నూరు శాసనసభ్యులు వేదికల మీద ఇష్టానుసారంగా మాట్లాడడం పరిపాటిగా మారింది. ఆ మాటలను వెనక్కి తీసుకోవాలని జర్నలిస్టులందరికీ క్షమాపణ చెప్పాలని జిల్లా వ్యాప్తంగా నిరసన జరుగుతుంటే పొరపాటున సరిదిద్దుకోవాల్సింది పోయి గుండా దాడులకు దిగడం నీచ సంస్కృతిని బయటపెడుతుంది. విద్యావంతుడు ఉద్యమకారుడు అక్రమ అరెస్టులకు గురైనవాడు తెలంగాణ ఉద్యమానికి ఉస్మానియా యూనివర్సిటీలో వేధింపులకు గురైన వాడినని చెబితే పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు పార్లమెంటు సభ్యులుగా చెన్నూరు నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించారు. కానీ సాంస్కృతిని మరిచి నీచాతి నీచంగా జమీందారులను మించి భూస్వాముల పెత్తందారుల అరాచకాలను తలదన్నే రీతిలో బాల్క సుమన్ వ్యవహారం ఉంది. పెరుగుట విరుగుట కొరకే అన్నట్టు అహంకారంతో కవ్వింపు చర్యలు దిగిన ఎంతోమంది ఇవాళ ప్రజల నుండి విలువేయబడ్డ సంగతి మర్చిపోకుండా జర్నలిస్టులు అంటే చులకన భావాన్ని విడనాడి వెంటనే క్షమాపణ చెప్పాలని డి జె ఎఫ్ డిమాండ్ చేస్తుంది. ఈ రౌడీ గూండా చర్యలను జర్నలిస్టు సంఘాలన్నీ కూడా వ్యతిరేకిస్తూ ఆందోళన కార్యక్రమాలను ఉదృతం చేయాలని డి జె ఎఫ్ జర్నలిస్టు సంఘాలను కోరుతున్నది.



## బిఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు నాయకులు

**చిట్యాల,విశాలభారతి:** బిఆర్ఎస్ పార్టీలోకి చేరికల పరంపర కొనసాగుతూనే ఉంది. నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు. చిట్యాల మున్సిపాలిటీ కి చెందిన కాంగ్రెస్ పార్టీ 4వ వార్డు కౌన్సిలర్ జమాండ్ల జయమ్మ శ్రీనివాస్ రెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ గోధుమగడ్డ పద్మ జలంధర్ రెడ్డి, చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కందాటి రమేష్ రెడ్డి, సీనియర్ నాయకులు కందాటి సత్తిరెడ్డి, పట్టణ ఉపాధ్యకులు చెరుకు సాయిరాం, గౌడ సంఘం పట్టణ అధ్యక్షులు పబ్బు జగదీష్ గౌడ్, మండల నాయకులు రావుల మల్లేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి మల్లేష్,ఉరుమడ్ల గ్రామశాఖ అధ్యక్షులు జంపాల నరేష్, ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షులు చెరుకు బాలకృష్ణ, సీనియర్ నాయకులు రావుల రాంరెడ్డి, జమాండ్ల లింగారెడ్డి, రావుల సత్యనారాయణ, సామ విజయ భాస్కర్ రెడ్డి, జమాండ్ల చంద్రశేఖర్, జమాండ్ల వెంకట్ రెడ్డి, రావుల జాన్ రెడ్డి లు పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకి నాయకులకి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు.



## సబ్బండ వర్గాలకు మేలు చేసే మేనిఫెస్టో

- బీఆర్ఎస్ రామన్నపేట మండల అధ్యక్షుడు ఉదయ్‌రెడ్డి
- బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రకటనపై హర్షం

**రామన్నపేట, విశాల భారతి:** సబ్బండ వర్గాలకు మేలు చేసే మేనిఫెస్టోను బీఆర్ఎస్అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించడం ఆనందంగా ఉందని బీఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు మందడి ఉదయ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఉదయ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌పార్టీ మేనిఫెస్టో ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. సంతోషం వ్యక్తం చేస్తూ నాయకులు పటాకులు కాల్చి స్వీట్ల పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో చిరుమర్తి చేయూత ఫౌండేషన్ చైర్మన్ చిరుమర్తి మనోజ్, ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి బలరాం, బీఆర్ఎస్ మండల కార్యదర్శి పోషబోయిన మల్లేశం, పట్టణ అధ్యక్షుడు పోతరాజు సాయి , సర్పంచులు రేఖ యాదయ్య, ఎంపీటీసీ వేమవరం సుధీర్ బాబు, ఎండీ ఆమీర్, ఉప సర్పంచ్ పొడిచేడు కిషన్, నాయకులు బందెల రాములు బత్తుల వెంకన్న, అంతటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**చిట్యాల,విశాలభారతి:** చిట్యాల పట్టణంలోని శ్రీ కనకదుర్గ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.మొదటి రోజు అమ్మవారు శ్రీ బాలత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ ఆచార్యత్వంలో గణపతి పూజ, కలశ స్థాపన నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు బాల త్రిపుర సుందరి, గాయత్రి, అన్నపూర్ణ, మహాలక్ష్మి, మహా చండీ, సరస్వతి, లలితా త్రిపుర సుందరి, దుర్గాదేవి, మహిషాసుర మర్దిని, రాజరాజేశ్వరి దేవి గాభక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.దసరా రోజున దుర్గాదేవి రెండు అలంకారాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. దసరా రోజు ఉదయం మహిషాసురమర్దిని గా మధ్యాహ్నం నుండి శ్రీరాజరాజేశ్వరీదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి, చైర్మన్ శీలా సత్యనారాయణ, డైరెక్టర్లు గంజి వెంకటేశం, పోకల అచ్చాలు, బుద్ధ విమల కృష్ణ మూర్తి, సాయిరెడ్డి ప్రతాపరెడ్డి, జిట్టా శేఖర్, వరకాంతం నర్సిరెడ్డి, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రవళికది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే..

- డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిషోర్

**నడిగూడెం, విశాలభారతి:** ప్రవళిక ది ఆత్మహత్య కాదని ప్రభుత్వ హత్యేనని ప్రభుత్వ నైతిక బాధ్యత వహించాలని సూర్యాపేట జిల్లా డివైఎఫ్ఐ అధ్యక్షులు కాసాని కిషోర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో డివైఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్ధన్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్ 2 పరీక్షలు, డీఎస్సీ రద్దు కావడం, రకరకాల వివాదాలతో వరుస పోటీ పరీక్షలు రద్దు కావడంతో తీవ్రమనస్థాపానికి గురైన ప్రవళిక, భవిష్యత్తులో ఉద్యోగాలు సాధించలేమన్న మానసిక ఆవేదనతోనే ఆత్మహత్య కి పాల్పడిందన్నారు.గత 10 ఏళ్లుగా ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ,మోసపూరిత వాగ్దానాలు చేస్తూ నిరుద్యోగ యువతను మభ్యపెడుతుందని బిస్వాల్ కమిటీ పిఆర్సి రిపోర్టు ప్రకారం రాష్ట్రంలో 1,91,126 పోస్టులు ఖాళీలుగా ఉన్నట్లు గుర్తించినప్పటికీ అందుకు తగిన విధంగా ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు భర్తీ చేయాల్సిన ప్రభుత్వం అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తుందన్నారు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వందలాది మంది నిరుద్యోగులు ఆత్మహత్య లు చేసుకున్నారని.గత సంవత్సరం 80 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ప్రకటించినప్పటికీ అవి హడావుడి ప్రచార ఆర్భాటానికే తప్ప నియామకాలు లేవు ఎన్నికల్లో ముందు మరోసారి నిరుద్యోగ యువత ఓట్ల కోసం నోటిఫికేషన్లు ప్రకటించింది తప్ప సకాలంలో పరీక్షలు నిర్వహించి ఉద్యోగాల భర్తీ చేయడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించటం శోచనీయమన్నారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వానికి నిరుద్యోగ యువత తగిన బుద్ధి చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నడిగూడెం మండల అధ్యక్ష కార్యదర్శులు జమ్మి ఎల్లయ్య, కేశగానీ భద్రయ్య, మండల నాయకులు నోసిన అంజి, కాసాని రాంబాబు, చైతన్య, కాసాని వినోద్, గోలి శ్రీకాంత్, తిరుమలేష్, వెంకీ తదిరులు పాల్గొన్నారు.



## మండలం వ్యాప్తంగా దేవీ నవరాత్రుల వేడుకలు ప్రారంభం

**నడిగూడెం, విశాల భారతి :** మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం దేవి నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభించారు ప్రారంభమైనవి. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ధూపదీప నైవేద్యాల తోటి అంగరంగ వైభవంగా ప్రతిష్టించారు. మొదటి రోజైన అమ్మవారు స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అమ్మవారి దర్శనం ఇచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారమై, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఎప్పుడు ఉంటాయని వేద శాస్త్ర పండితులు అన్నారు. అమ్మవారి పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## దిర్శించర్ల గ్రామంలో వైభవంగా అమ్మవారి ఉత్సవాలు

**నేరేడుచర్ల, విశాల భారతి :** దిర్శించర్ల గ్రామంలో దేవాలయ ఆవరణలో ఆదివారం గ్రామ పెద్దల, గ్రామ ప్రజల సహకారంతో అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలను దేవి నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతున్నది. అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో కమిటీ వారు అమ్మవారి మాలలతో భక్తిశ్రద్ధలతో అదే విధంగా ఎంగిలి బతుకమ్మ కార్యక్రమం నుండి చివరి రోజు సద్దల బతకమ్మ వరకు మరియు అమ్మవారి ఊరేగింపు వరకు ప్రజలంతా సంతోషముతో ఈ కార్యక్రమాలలో పాల్గొనడం చాలా ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## క్రీడలతోనే మానసిక ఉల్లాసం

- విద్యుత్ శాఖ డీఈ మధుసూదన్

**తొర్రూరు, విశాల భారతి:** తొర్రూరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంప్లాయిస్ వాలీబాల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో దసరా వాలీబాల్ కప్ 2023ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న తొర్రూరు పట్టణ విద్యుత్ శాఖ డి. ఈ మధుసూదన్ మాట్లాడుతూ ఆటల వల్ల మానసికంగా దృఢంగా అవుతామని. ఉద్యోగులు పని భారం నుండి ఉపశమనం పొందడం కోసం ఇది ఒక వేదికగా అవ్వడం సంతోషాన్నిచ్చింది. ఉపాధ్యాయులు అందరూ కలిసికట్టుగా ఒక సంఘంగా ఏర్పడి క్రీడల్లో పాల్గొనడంతో పాటు సమైక్యతను చాటుతున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలోముఖ్య అతిథులుగా పట్టణ విద్యుత్ శాఖ డి. ఈ మధుసూదన్, తొర్రూరు ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జిల్లా లక్ష్మీనారాయణ, కొండం జనార్ధన్, నర్సిరెడ్డిశ్రీనివాసరెడ్డి, ఎంప్లాయిస్ వాలీబాల్ అసోసియేషన్ కమిటీ ప్రెసిడెంట్ నగేష్, జనరల్ సెక్రెటరీ శంకర్, ట్రెజరీ ఫణీంద్ర, గౌరవ అధ్యక్షులు విజయ్ కుమార్ ముఖ్య అతిథులు డి ఈ మధుసూదన్ తోరూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జిల్లా లక్ష్మీనారాయణ, కొండం జనార్ధన్, నర్సిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## మేకల తండాలో ఘనంగా బతుకమ్మ పండుగ

**తిరుమలాయపాలెం, విశాల భారతి:** తిరుమలాయపాలెం మండల పరిధిలోని మేకల తండా గ్రామంలో ఆదివారం నాడు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సంబురాలను పిల్లలు పెద్దవారు యువకులు విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడి పాడారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ తెలంగాణలో బతుకమ్మ పండుగకు ఒక ప్రత్యేకమైన స్థానము కలదని తెలియజేశారు ప్రతి దేవుడిని పూలతో పూజిస్తే ఈ పండుగను మాత్రము పువ్వులనే దేవుళ్ళుగా భావించటం, ప్రపంచంలో ఎక్కడా లేనటువంటి సంస్కృతి, సాంప్రదాయాన్ని తెలంగాణలో కొనసాగించటం ఇది ఒక ప్రత్యేకమైనటువంటి విషయముగా తెలియజేసారు. తొమ్మిది రోజులు నిర్వహించుకునే బతకమ్మ పండగ యొక్క విశిష్టతలో ఒక్కొక్క రోజు ఒక్కొక్క పూలతో ఒక్కొక్క దేవతగా నామకరణం చేస్తూ పూజించటం అనేది ఈ పండగ యొక్క ప్రత్యేకతగా తెలియజేసారు. ఆడిపాడుతూ సంబరాలను అంబరాన్ని అంటే విధంగా ఆడి పాడారు ఈ కార్యక్రమంలో బొడ రఘురాం, ధరావత్ సుమన్, బొడా హరీష్, బోడ స్రవంతి, శ్రీకాంత్, పాల్గొన్నారు.



## ఉత్తమ్, పద్మావతిలకు పార్టీ టికెట్లు రావడంపై హర్షం

**కోదాడ, విశాల భారతి:** కోదాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఉత్తమ్ పద్మావతి రెడ్డి ప్రకటన పట్ల యూత్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు డేగ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం కోదాడలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వీట్లు పంపిణీ చేసుకుని బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డేగ శ్రీదర్ మాట్లాడుతూ రాబోయే శాసనసభ ఎన్నికల్లో కోదాడ ఎమ్మెల్యేగా ఉత్తమ్ పద్మావతి రెడ్డి భారీ మెజారిటీతో గెలవడం ఖాయం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సోనియాగాంధీ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అన్నారు. జై కాంగ్రెస్, జై ఉత్తమ్, జై పద్మావతి రెడ్డి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వంటిపులి వెంకటేష్, గంధం యాదగిరి , బాల్ రెడ్డి , కాంపటి శ్రీను, సంతోష్ రోషన్, భాగ్యరాజు, వెంకట్, చింటూ, నవీన్, కళ్యాణ్, పాలడుగు సంజీవ్, గంధం జానీ, మాతంగి బసవయ్య, కుడుములు లక్ష్మి నారాయణ, రేవూరి వెంకటాచారి, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ముట్టడి

**నూతనకల్ , విశాల భారతి:** మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులపై,కార్యకర్తలపై పోలీసులు అక్రమంగా, దౌర్జన్యంగా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి పోలీస్ స్టేషన్ ను ముట్టడించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీకి పోలీసులు కొమ్ముకాస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. అందరికీ న్యాయం చేయాల్సిన పోలీసులు పక్షపాతం చూపించడం సరి కాదని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్లెం కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు కట్ట మల్లారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు బొడ్డుపల్లి అంజయ్య,నాయకులు జటంగి గణేష్ యాదవ్, సాగర్, మహేష్ రెడ్డి, కేశవాచారి ఉపేందర్ రెడ్డి, అశోక్ యాదవ్ గౌతమ్ శ్రీనాథ్ అంజి తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థిగా పోదెం వీరయ్య



**భద్రాచలం, విశాల భారతి:** తెలంగాణ రాష్ట్రంలో పార్టీల పొత్తుల నేపథ్యంలో బి ఆర్ ఎస్ ఇప్పటికే ఎమ్మెల్యే అభ్యర్థులను ఖరారు చేసింది. బీఆర్ఎస్ తో పొత్తు కుదుర్చుకోవాలన్న కామ్రేడ్ల ఆశ కెసిఆర్ నిరాశపర్చాడు కామ్రేడ్లు ఆశించిన మేరకు కేసిఆర్ సీట్ల పంపకాల లో కామ్రేడ్లుకు నిరాశ ఎదురయింది దాంతో కామ్రేడ్లు సంక్షిప్తంలో పడ్డారు కెసిఆర్ మొండిచేయి చూపించిన తరుణంలో. మళ్లీ కామ్రేడ్ల ఆలోచన కాంగ్రెస్ వైపు మరలింది అక్కడ కూడా సుక్కెదురైంది ఎదురయింది భద్రాచలం సీటు కాంగ్రెస్ పొత్తులో భాగంగా సిపిఎం కి దక్కుతుందని ఆశ పెట్టుకున్న చివరకు ఉత్కంఠ వీడింది ప్రస్తుత కాంగ్రెస్ నుండి గెలుపొందిన ఎమ్మెల్యే పోదెం వీరయ్య భద్రాచలం సీటు కోసం అధిష్టానాన్ని కలవడం జరిగింది ఆ నేపథ్యంలో ఆ సీటు ఆయనకే ఖరారు చేస్తున్నట్లు అధిష్టానం ప్రకటన చేయటం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది ఈసారి కూడా కాంగ్రెస్ పార్టీ విజయం ఖరారు అవుతుందని ఆశాభావం వ్యక్తపరిచారు భద్రాచలం అసెంబ్లీ టికెట్ పోదెం వీరయ్య కు ఖరారు చేసిన అధిష్టానాన్ని కాంగ్రెస్ శ్రేణులు అభినందనలు తెలిపారు.



## ఆర్టీసీ ఉద్యోగులకు అండగా నిలుస్తాం

**తొర్రూరు, విశాల భారతి:** ఆర్టీసీ ఉద్యోగులకు అండగా నిలుస్తామని తొర్రూరు డిపో మేనేజర్ పరిమళ తెలిపారు. తొర్రూరు డిపో కండక్టర్ సోమ్లా నాయక్ అనారోగ్యంతో తాజాగా మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం డివిజన్ కేంద్రంలో డిఎం పరిమళ పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి వారికి 20 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ... కండక్టర్లు డ్రైవర్ల సహకారంతో తొర్రూరు డిపోను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సంస్థ లాభాల్లో నడవడానికి వారి కృషి ఎంతో ఉందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఇకపై సంస్థ లాభనష్టాలు, సంస్థ ఆదాయంతో నిమిత్తం లేకుండానే ఉద్యోగుల బాగోగులకు ప్రభుత్వం నుంచి భరోసా లభించనుందని తెలిపారు.కార్యక్రమంలో ఏడీసీ మల్లికార్జున్, బానోతు నారాయణ, జిలుకర యాదగిరి, ఆర్టీసీ సిబ్బంది జి. రమేష్, పుల్లయ్య, సిహెచ్ స్వామి , యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా ఆది నారాయణ

**భువనగిరి టౌన్ ,విశాల భారతి :** యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా చందుపట్ల గ్రామ మాజీ సర్పంచ్ వల్లందాస్ ఆదినారాయణను నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవరెడ్డి నియమిస్తూ ఉత్తర్వుల కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో పదవి ఇచ్చిన డిసిసి అధ్యక్షులు అందుకు సహకరించిన ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు కుంభ అనిల్ కుమార్, రెడ్డి రాష్ట్ర నాయకులు పక్షిమట్ల శివరాజ్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీ రుణం తీర్చుకోవడానికి రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడానికి శక్తివంచన లేకుండా కార్యకర్తగా పనిచేసిపార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు ఓరుగంటి ఆంజనేయులు గౌడ్ మండల సంయుక్త కార్యదర్శి గంగాదేవి రవి గ్రామ శాఖ అధ్యక్షులు పిట్టల వెంకటేష్ నాయకులు పులి రాజు అనుకుంట కొండల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా మెడికల్ క్యాంప్

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న అశ్వాపురం పోలీసులు
- మెడికల్ క్యాంప్ లో సర్వ సూపర్ స్పెషాలిటీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాఘవ

**అశ్వాపురం, విశాల భారతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలో గల ఓంశక్తి ఓంశ్రీ ఆదిపరాశక్తి సిద్ధుని పీఠములో దసరా మహోత్సవముల సందర్భముగా మొదటి రోజు ప్రత్యేక అభిషేకముతో ప్రారంభం అయిన సందర్భంగా మొదటి రోజు అమ్మవారు త్రి శక్తి అలంకరణలో దర్శనమిచ్చారు. అలాగే సర్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు ఉచిత మెగా మెడికల్ కాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అశ్వాపురం సిఐ , మరియు అశ్వాపురం ఎస్సై పాల్గొన్నారు, అనంతరం స్వర సూపర్ స్పెషలిటీ వ్యవస్థపుకులు డాక్టర్ రాఘవ పలువురికి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, వయోవృద్ధులు, పేషెంట్లు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు,

# చనిపోయిన విద్యార్థినిపై అబాండాలా?

- ప్రవళిక ఆత్మహత్య ముమ్మాటికీ ప్రభుత్వ హత్యనే



**సూర్యాపేట, విశాల భారతి**:ప్రవళిక ఆత్మహత్య ముమ్మాటికీ ప్రభుత్వ హత్యనే పివైఎల్ జిల్లా అధ్యక్షులు నల్గొండ నాగయ్య, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు పోలెబోయిన కిరణ్ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ చంద్ర పుల్లా రెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకర్ల సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ చనిపోయిన విద్యార్థినిపై అభండాలు వేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. మీ మాటలకు విశ్వాసనీయత ఉన్నదా అని డీసీపీ ని ప్రశ్నిచారు. ప్రవళిక అనుమానాస్పద స్థితిలో హైదరాబాద్ అశోక్ నగర్ లో సూసైడ్ చేసుకొని తనువు చాలించింది. వేలాది మంది నిరుద్యోగులు గంటల తరబడి రోజు చదువుతూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. ప్రవళిక మరణ వార్త తెలియగానే అశోక్ నగర్ ప్రాంతమంతా నినాదాల హోరుతో రగిలిపోయింది. నిరుద్యోగ సమస్య తెలంగాణలో ఏ స్థితిలో ఉందో కండ్లకు కట్టినట్టు కనబడింది అని అన్నారు. ప్రవళిక మరణానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించి ప్రవల్లిక కుటుంబానికి న్యాయం చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. తన మరణంపై నిజ, నిజాలను నిగ్గు తేల్చాలని నినదించానా వారిపై లాటీలు జులిపించి ఒక్కొక్కరిని గోడ్డును బాదినట్టు బాది అందరినీ చదరగొట్టి ప్రవళిక మృతదేహాన్ని తల్లిదండ్రులు లేకుండానే గాంధీ హాస్పటల్ మార్చురీకి తరలించారు అని ఆవేదన వ్యక్తంచేశారు. అంత్యక్రియలు జరిగిన తరువాత సెంట్రల్ జోన్ డిసిపి వెంకటేశ్వరరావు విలేకరుల సమావేశం పెట్టి తను లవ్ ఎఫైర్ తో చనిపోయిందని తన సమస్య ఉద్యోగం రాకపోవడం కాదని మాట్లడటం అంటే ప్రవళిక ఆత్మహత్యని తప్పు దోవ పట్టించడమే అని అన్నారు. ప్రవలిక పరీక్షలు వాయిదా పడటం వల్లనే ఆత్మహత్య చేసుకుంది అని అన్నారు. ప్రభుత్వమే ప్రవళిక ఆత్మహత్యకి బాధ్యత వహించి కోటి రూపాయలు ఎక్స్ గేషియా ప్రకటించాలి, తన కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న ప్రతి ఒక్కరికి మూడు లక్షల రూపాయలు ఇవ్వాలి, పరీక్ష తేదీలను ప్రకటించాలని అన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, మందడి శ్రీధర్, పీవైఎల్ నాయకులు దుధిపాల ప్రవీణ్, ప్రజిత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

**తొర్రూరు, విశాల భారతి:**క్రీడలకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని ఎస్ జీ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి జ్యోతి అన్నారు. గత కొద్దిరోజులుగా తొర్రూరు కేంద్రంలోని యతి రాజారావు పార్కులో ఎస్ జీ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో 67 రాష్ట్ర స్థాయి 17, 19 ఏళ్ల బాల, బాలికల రగ్బీ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో 10 జిల్లాల క్రీడాకారులు పాల్గొనగా అండర్ 19 బాలుర విభాగంలో నల్గొండ జిల్లా విజేతగా నిలిచింది. రన్నరప్ గా రంగారెడ్డి స్థానాన్ని నిలుపుకుంది. బాలికల విభాగంలో మహబూబ్ నగర్ విజేతగా నిలవగా , ద్వితీయ స్థానంలో మెదక్ నిలిచింది. అండర్ 17 విభాగంలో విజేతగా నిజామాబాద్ నిలవగా, ద్వితీయ స్థానంలో నల్గొండ నిలిచింది. బాలికల విభాగంలో మహబూబ్ నగర్ నిలవగా, ద్వితీయ స్థానంలో నల్గొండ నిలిచింది. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. జిల్లాలో క్రీడల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. క్రీడల అభివృద్ధి లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లో మినీ స్టేడియంల నిర్మాణం చేస్తుందన్నారు. ఇప్పటికే 50 శాతం స్టేడియాల నిర్మాణం పూర్తి చేసిందన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి క్రీడా పాలసీని తయారు చేయటానికి సీఎం కేసీఆర్ క్యాబినెట్ సబ్ కమిటీని నియమించారని గుర్తు చేశారు. దేశంలోనే అత్యుత్తమ క్రీడా పాలసీని రూపొందిస్తుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో, ఒలింపిక్స్‌లో రాణించిన క్రీడాకారులకు గత ప్రభుత్వాలు నామ మాత్రంగా సహాయ సహకారాలు అందించాయన్నారు. క్రీడాకారులను ప్రోత్సాహిస్తున్నామన్నారు. క్రీడాకారులకు ఉన్నత విద్యలో ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని తెలిపారు. రగ్బీ క్రీడలో రాణిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపారు. రాష్ట్రంలో ఈ క్రీడకు ఆదరణ పెరిగిందని తెలిపారు. రగ్బీ క్రీడలో జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, క్రీడా కన్వీనర్ చెడుపల్లి ఐలయ్య, రాష్ట్ర పరిశీలకులు యూసఫ్ ఖాన్, రమేష్, శ్రీనివాస్,విజయ్ కుమార్, సునీల్, రెమో శ్రీనివాస్, మాధవి, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఊట్కూర్ లో దేవీ నవరాత్రి ఉత్సవాలు షురూ



**శాలిగౌరరారం ,విశాలభారతి:** శాలిగౌరరారం మండలం ఊట్కూర్ గ్రామంలో ని శ్రీ శివాంజనేయం దేవాలయం లో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.. గ్రామ పురోహితులు పులి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో కలశ స్థాపన,విగ్రహ ప్రతిష్ఠ తో నవరాత్రి వేడుకలు గ్రామంలో ప్రారంభమయ్యాయి. ముందుగా గ్రామంలోని గ్రామ దేవతలకు డప్పు చప్పుళ్లతో మామిడి తోరణాలు కట్టి ,కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు భక్తులు భవాని మాలలు వేసుకొని దీక్ష తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు రంగు ముత్యంరాజు ,కప్పల పార్థసారథి ,రంగు రాములు ,పల్స శ్రీనివాస్ ,రంగు సైదులు , రంగు బిక్షం,రంగు వీరయ్య , బొమ్మగొని బాలరాజు , రామసాని చరణ్ ,కుర్ర గణేష్ , యంపల్ల పురుషోత్తం రెడ్డి ,చిత్తలూరి సైదులు ,తో పాటు పలువురు భక్తులు ,మహిళలు పాల్గొన్నారు. శ్రీ వివేకానంద యూత్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద పొగుల ,చిరంజీవి, కప్పల లక్ష్మీనారాయణ ,నాగరాజు తో పాటు పలువురు భక్తుల సహాయ సహకారాలతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో మొత్తం 5 విగ్రహాలు నెలకొలిపి అమ్మవారిని ఆరాధిస్తూ భక్తిభావాన్ని చాటి చెపుతున్నారు.



## బీఆర్ఎస్ బీఫామ్ తో 'తెల్లం' సందడి

- కేసీఆర్ చేతులమీదుగా బీఫామ్ తీసుకుంటున్న 'తెల్లం'

**భద్రాచలం, విశాల భారతి:**భద్రాచలం బి.ఆర్.ఎస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా కెసిఆర్ చేతుల మీదుగా బీఫామ్ తీసుకున్న తెల్ల వెంకటరావు అనంతరం భద్రాచలం చేరుకున్న వెంటనే పార్టీ శ్రేణులు ఆనందోత్సవాలతో తెల్లం వెంకటరావుని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు వెంకట్రావు గెలుపు ఖాయమని ఎల్లం వెంకటరావు గెలుపును ఎవరు ఆపలేరని నినాదాలు చేశారు భద్రాచలం ప్రాంతంలో పుట్టి పెరిగి ఈ ప్రాంత బాధకు సాధకాలు చవిచూసిన వ్యక్తి విద్యావంతులు ప్రముఖ డాక్టర్ తెల్ల వెంకటరావును అందరు ఆదరిస్తారని వారు అన్నారు పార్టీ నాయకత్వం ఒక్కతాటి పైన ఐక్యతతో తెల్లం వెంకటరావు గెలుపుకు కృషిచేస్తామని పార్టీ శ్రేణులు వివరించారు తెల్లం వెంకట్రావు మీద భద్రాచలం నియోజకవర్గం ప్రజల మీద పార్టీ నాయకత్వం మీద ఎంతో నమ్మకంతో కెసిఆర్ బిఫామ్ ఇచ్చి నందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భద్రాచలం అసెంబ్లీ లో గులాబీ జెండా ఎగరవేసి ఎమ్మెల్యే ను గెలిపించుకొని కేసీఆర్ కి కానుక ఇస్తామని పార్టీ శ్రేణులు తెలిపారు.



## బీఆర్ఎస్ పార్టీలోకి చేరికల జోరు..

**రామన్నపేట, విశాల భారతి:** రామన్నపేట మండలం జనంపల్లి గ్రామానికి చెందిన 100 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే చిరుమర్తి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ లో చేరారు వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యపార్టీలో చేరిన వారిలో మాండ్ర ఉపేందర్ మెడబోయిన మహేష్ జిల్లా శ్రీకాంతు భైరు శివ సింగం సైదులు నక్క రుక్కయ్య గట్టు నరేష్ గట్టు చందు నడిగోటి అంజయ్య మెడబోయిన వెంకన్న బాతుక రవి సంగిశెట్టి శివాజీ గట్టు శ్యామ్ నక్క రాంనర్సయ్య మేడబోయిన లింగస్వామి వంగాల మత్స్యగిరి వంగాల నవీన్ గట్టు మహేష్ నూకల దేవేందర్ మెడబోయిన నరేష్ హివరికుప్పల సురేందర్ వరికుప్పల శ్రీకాంత్ వరికుప్పల సతీష్గొలుసుల అరవిందు గొలుసుల శ్రీను గట్టు రవి ఎండి అక్బర్ గట్టు బన్నీ నూకల అనిల్ మార్సాని ఐలయ్య తదితరులు ఉండగా ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం గ్రామ సర్పంచ్ రేఖ యాదయ్య ఎంపీటీసీ వేమవరం సుధీర్ బాబు గ్రామ శాఖ అధ్యక్షుడు బండ దామోదర్ రెడ్డి మార్కెట్ మరియు సింగల్ విండో డైరెక్టర్లు బండ ఉపేందర్ రెడ్డి నక్క యాదయ్య వార్డు మెంబర్లు పోషబోయిన నరసింహా సంగిశెట్టి నారాయణ మండల నాయకులు నడిగోటి కృష్ణ తదితరులు పాల్గొనడం జరిగింది



## రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ సమస్యలు పరిష్కరించాలి

**మునగాల, విశాల భారతి:**రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ లు సూర్యాపేట జిల్లాలో చాలా బలంగా ఉంది అని సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పోనుగోటి భుజంగరావు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎంపి, పిఎంపీలకు న్యాయం జరిగే వరకూ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆర్ఎంపీలు పరిధికి మించి ప్రవర్తించవద్దని స్థాయిని మించిన వైద్యం చేయవద్దని సూచించారు. అనంతరం సమావేశంలో ఆర్ఎంపి, పిఎంపి లకు జిల్లా నుండి ఐ డి కార్డ్ పంపిణీ చేసినారు. ఆర్క హాస్పిటల్ ఖమ్మం డాక్టర్ సీజనల్ వ్యాధులపై, క్యాన్సర్ ప్రాథమిక లక్షణాలను ఎలా గుర్తించాలో ఆర్ఎంపీలకు అవగాహన కలిగించే విధంగా సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గా దొంతగాని రవిబాబును ఎన్నుకున్నారు. మునగాల మండల కార్యదర్శిగా చిరందాసు ఉపేంద్ర చారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ గుణగంటి వెంకన్న గౌడ్ ప్రధాన కార్యదర్శి, ఎస్పీ వెంకటప్పయ్య జిల్లా క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు, ఎస్ కే మన్సూర్ అలీ జిల్లా ఉపాధ్యక్షులు, కోదాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, మండల కమిటీలు హాజరైనారు. మునగాల మండలంలోని అన్ని గ్రామాల నుండి సుమారు 45 మంది ఆర్ఎంపీ పాల్గొన్నారు.




## బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

- కేంద్ర సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

**కోదాడ, విశాల భారతి:**కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు వారి కుటుంబం కోసమే పని చేస్తాయని బిజెపి ప్రభుత్వం దేశ అభివృద్ధి కోసం పనిచేస్తుందని ఐటి ఎలక్ట్రానిక్స్ మరియు స్కిల్ డెవలప్మెంట్ శాఖ కేంద్ర సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని పెరిక కల్యాణ మండపంలో పోలింగ్ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్చార్జిల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేసి రానున్న 45 రోజులు పార్టీ కోసం కష్టపడితే తప్పక అధికారంలోకి వస్తామన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో నాడు పార్లమెంటులో బిజెపి క్రియాశీలక పాత్ర పోషించిందని తెలిపారు. గత తొమ్మిది సంవత్సరాల్లో తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తొమ్మిది లక్షల కోట్లు ఇచ్చిందని రాష్ట్రంలో బిజెపి చేసిన అభివృద్ధి తప్ప బి ఆర్ ఎస్ పార్టీ చేసింది ఏమి లేదన్నారు. బిఆర్ఎస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఎన్నికలు సమీపిస్తున్న వేళ కొత్త పథకాల పేరుతో ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. బీ, కాంగ్రెస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగిన భాజపా వైపు ప్రజలు చూస్తున్నారన్నారు. కోదాడ అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు, జిల్లా ఇన్చార్జి విద్యాసాగర్ రెడ్డి, అసెంబ్లీ ప్రబారి సతీష్, జిల్లా అధ్యక్షులు బొబ్బ భాగ్యరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిరాజు యశ్వంత్, రాష్ట్ర ఓబిసి మోర్చా బొలిశెట్టి కృష్ణయ్య, రాష్ట్ర నాయకులు కనగాల వెంకటరామయ్య, నూనె సులోచన, ఓవీ రాజు పద్మా రెడ్డి, పట్టణ అధ్యక్షులు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగభృతి ఏమైంది కేసీఆర్.!





- లక్షలాది మంది యువత ఒక్కసారి ఆలోచించి ఓటేయండి
- తెలంగాణను వంచించేలా బీఆర్ఎస్ మేనిఫెస్టో: శ్రీరాములు యాదవ్
- రేపు బడంగ్ పేటలో జరిగే "మహేశ్వరం జనగర్జన' జయప్రదం చేయాలి.

**మహేశ్వరం, విశాల భారతి:** గత 2018 ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టో హామీలను నెరవేర్చకుండా మరోసారి తెలంగాణ సమాజాన్ని మోసం చేసేలా సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టో2023 ఉందని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు.గత ఎన్నికల్లో ఇచ్చిన రైతు రుణమాఫీ, నిరుద్యోగభృతి, దళితులకు 3 ఎకరాల భూమి, మిషన్ భగీరథ పేరుతో ఇంటింటికీ నల్లా, కేజీ టు పీజీ ఉచిత విద్య, రేషన్ కార్డులు, ఫించన్ల హామీలను నెరవేర్చకుండా మరోసారి పాతసీసాలో కొత్తనీరు పోసినట్లు సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో ఉందని ఎద్దేవా చేశారు అందెల శ్రీరాములు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఇస్తామన్న వరద సాయం రూ.10 వేలు ఇవ్వకుండా.. హామీలు నీటి మూటలైనట్లే... ఈ వాగ్దానాలను తుంగలో తొక్కుడు ఖాయమన్నారు శ్రీరాములు. బీజేపీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం ఫ్రీగా ఇస్తామని మా పార్టీ అధినాయకత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు అందెల శ్రీరాములు. కార్పొరేట్ సెక్టార్లల్లో ఉన్న విద్య, వైద్యం సీఎం కేసీఆర్ కుటుంబానికి ఆదాయ వనరుగా మారిందన్నారు. పేదల జేబులకు చిల్లు పెడుతూ... ఆడబిడ్డల ఊసురు తీస్తూ లిక్కర్ ఆదాయంతో కాలం వెళ్లదీస్తున్న బీఆర్ఎస్ సర్కార్ ను బొందపెట్టాలని అందెల శ్రీరాములు యాదవ్ పిలుపునిచ్చారు. రేపు సాయంత్రం బడంగ్ పేట సిరిపురం యాదయ్య గ్రౌండ్ (రంగారెడ్డి జిల్లా గ్రంథాలయం పక్కన)లో జరిగే కేంద్ర రక్షణ శాఖమంత్రి రాజ్ నాథ్ సింగ్ గారి బహిరంగ సభను జయప్రదం చేసి కాషాయదళ సత్తా ఏంటో చూపాలని బీజేపీ, బీజేవైఎం, మహిళామోర్చా సహా అందరినీ కోరారు శ్రీరాములు. ఉన్నతాధికారులు, పోలీసులు, బీజేపీ శ్రేణులతో కలిసి గ్రౌండ్ ఏర్పాట్లను పరిశీలించారు అందెల. మహేశ్వరం జనగర్జన సభా ఇన్చార్జి కడారి జంగయ్య, కన్వీనర్ దేవేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం మల్లారెడ్డి, సామ సంజీవరెడ్డి, నడికుడి యాదగిరి, అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, అశోక్ గౌడ్, రామకృష్ణారెడ్డి, శ్రవణ్, ముఖేష్, లింగం యాదవ్, రామిడి వీరకర్ణారెడ్డి, శూరకర్ణారెడ్డి, చిత్రం శ్రీనివాస్ సహా బీజేపీ, బీజేవైఎం అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



## 'బీఆర్ఎస్మేనిఫెస్టోతో సకల జనులకు మేలు'

**గరిడేపల్లి, విశాల భారతి** :తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టో బిఆర్ఎస్ పార్టీ సకల జన సంక్షేమ మేనిఫెస్టో అని భారాస పోనుగోడు గ్రామ శాఖ అధ్యక్షులు చామకూరి అంజి గౌడ్ అన్నారు.ఆదివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పోనుగోడు గ్రామములో కేసీఆర్ ప్రవేశట్టిన మ్యానిఫెస్టో తెలంగాణ రాష్ట్ర ప్రజల అవసరాలను గుర్తించి చేసిందన్నారు.దేశంలో ఎక్కడ లేని విధంగా ప్రవేశపెట్టిన రైతు బంధు పెట్టుబడి సాయం రూ10000 వేల నుంచి రూ. 16000 వేలకు దశల వారిగా పెంచుతాం అనేది చారిత్రాత్మక నిర్ణయం అన్నారు.ఆసరా పెన్షన్ రూ.2016 నుంచి రూ .5016,వికలాంగులు పెన్షన్ రూ.4016 నుండి రూ.6016 పెంచి,అర్హులైన నిరుపేద మహిళలకు రూ.3000 రూపాయలు ఇవ్వడం హర్షనీయం అన్నారు.అర్హులై అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులకు రూ.400 కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు కేసీఆర్ మేనిఫెస్టోలో చేర్చడం సంతోషదాయకం అన్నారు.కేసీఆర్ సారధ్యంలో భారాస 100 సీట్లు గెలుసుందని ధీమా వ్యక్తం చేశారు.హుజుర్నగర్ అభివృద్ధి ప్రధాత శానంపూడి సైదిరెడ్డి 50 వేల మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.ఉత్త మాటల ఉత్తమ్ ని నియోజకవర్గ ప్రజలు ఎవరు నమ్మరన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ నాయకులు అనంతు కరుణాకర్ గౌడ్, నాయకులు రేఖ శివ,నందిపాటి వేణు అనంతు నాగరాజు మద్దెమడుగు అరవింద్,చిర్ర శ్రవణ్, పృధ్వి,మస్తాన్,మధు సందీప్, సైదులు,సాయి,వేణు,కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర చండూర్ గడ్డది

**చండూర్, విశాల భారతి:** చండూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్బీ గార్డెన్ లో మునుగోడు నియోజకవర్గ ముదిరాజ్ నాయకులు నారబోయిన రవి ఆధ్వర్యంలో ముదిరాజ్ ఆత్మ గౌరవ సభ నిర్వహించారు. పాల్గొన్న బిత్తిరి సత్తి మాట్లాడుతూ నల్లగొండ అంటే నల్లగుండు అనుకున్నా.. గుండు కాదు మందుగుండు ఇది. మందుగుండు తో రజాకార్ల కు ఎదురొడ్డిన గడ్డ ఇది. బహుజనుల పోరాటాలకు చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, రంగనాయకులు, కొల మల్లమ్మ ఎన్నో పోరాటాలకు స్ఫూర్తి నిచ్చిన జిల్లా అని. నేను ఈ కులంలో పుట్టినా అని చెప్పుకోవడం నా తప్పా.ట్రోల్ చేసే వాళ్ళకి చెబుతున్న.పదవులు రాగ్గానే పెదవుల మూత పడొద్దు.మన వృత్తి లో ఉన్న బాధలను అసెంబ్లీ లో వినిపించాలి అంటే ఐక్యంగా పోరాడాలి.శిలా పలకలా పై మన పేర్లు ఉండాలి.మనతో పాటు అన్ని బీసీ కులాలను కలుపుకుని పోవాలి.మనమంతా కలిస్తే నల్లగొండ కాదు ట్యాంక్ బ్యాండ్ కాడ ఉంటామ్. హైదరాబాద్ లో రిక్షా తొక్కడం మానేసి ఆటో రిక్షాలు ఇప్పించిన ఘనత మేయర్ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్.అన్నారు.నారాబోయిన రవి మాట్లాడుతూ మునుగోడు టికెట్ విషయంలో పునరాలోచించాలి.ఉప ఎన్నికల్లో వంద ఎమ్మెల్యేలు,14 మంది మంత్రులు ప్రచారం చేస్తేనే కేవలం పది వేల ఓట్లతో బయటపడ్డామ్.అలాంటి వ్యక్తిని మా నెత్తిన తెచ్చి పెట్టారు, తనుగెలిచే అవకాశం లేదు.బీఆర్ఎస్ పార్టీ ఇకనైనా పునరాలోచించి బీసీ బిడ్డగా నాకు అవకాశం ఇవ్వాలి. 33,500 ముదిరాజ్ లు వున్నప్పటికీ మాకు అసెంబ్లీలో అవకాశము లేదు.ఆత్మాభిమానమ్ ఉన్నోడే ముదిరాజ్ అలాంటి మనకురాష్ట్రంలో మన జాతి 60 లక్షలు వున్నప్పటికీ మనకు అసెంబ్లీ లో స్తానం కల్పించ లేదు. విద్యాపరంగా, ఆర్థికంగా, రాజకీయంగా ముదిరాజ్ లు ఎదగాలి.మన జాతిని గుర్తించిన వారికే మనము ఓటు వేయాలి. మనమంతా ఐక్యతగా ఉండి ఓటు కోసం వచ్చిన వారిని నిలాదీయాలి, అప్పుడే మనల్ని గుర్తిస్తారు అన్నారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఈటెల వెంకటేశ్వర్లు,మాజీ జిల్లా అధ్యక్షులు కేశవన శంకర్ ముదిరాజ్, జిల్లా నాయకులు వెలుగు వెంకటేశ్వర్లు,కావాలి యాదగిరి,కస్తాల మాజీ సర్పంచ్ బొమ్మరబోయిన ప్రేమలత సైదులు,పోనుగోడు సర్పంచ్ మెరుగు శివయ్య,ఎంపీటీసీల వెంకన్న,గండూరి జనార్ధన్, కావలి యాదగిరి,ఉడతల పల్లి సర్పంచ్ కొరిమి ,అలివేలు ఓంకారం,మేకల యాదయ్య, డాక్టర్ నాగభూషణం, నక్క పోతు సురేష్,గండూరి నగేష్,లోకపోయిన రమణ ముదిరాజ్,బిత్తిరీ సత్తిఅభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## పాలకుర్తి చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ సంబరాలు

**పాలకుర్తి, విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర ఆపద్ధర్మ ముఖ్యమంత్రి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఈ రోజు తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్ ఎన్నికల పాక్షిక మేనిఫెస్టో విడుదల చేసిన సందర్భంగా పాలకుర్తి మండల అధ్యక్షులు పసునూరి నవీన్ ఎంపిపి నల్లా నాగిరెడ్డి ఆధ్వర్యంలో పాలకుర్తి చౌరస్తాలో కేసీఆర్ ఎర్రబెల్లి దయాకర్ రావు చిత్ర పటానికి క్షీరభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో అన్ని వర్గాల వారికి అనుకూలంగా ఉందని ప్రజలందరికీ చేరువలో మ్యానిఫెస్టో ఉండటం హర్షణీయం అని రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీదే అధికారం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యువజన నాయకులు మహిళ లు తదితరులు పాల్గొన్నారు.



## వచ్చే ఎన్నికల్లో కోదాడ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

- మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి

**మోతె , విశాల భారతి:** గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం మొత్తం పర్యటిస్తున్నారు, పర్యటనలో భాగంగా ఈరోజు మోతె మండలం రామపురం ఎక్స్ రోడ్డు గ్రామానికి చేరుకున్నారు, మోతె మండలం, రాఘవపురం ఎక్స్ రోడ్డు గ్రామానికి చెందిన, బిఆర్ఎస్ పార్టీ, కార్యకర్తలు, బొడ్డు వెంకన్న, బట్టిపల్లి మధుసూదన్ , కాంగ్రెస్ పార్టీలో చేరారు, గ్రామ శాఖ ఆధ్వర్యంలో, పద్మావతి రెడ్డి , పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు, ఈ కార్యక్రమంలో, మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కీసర సంతోష్ రెడ్డి ,రాఘవపురం ఎక్స్ రోడ్డు కాంగ్రెస్ పార్టీ, గ్రామ శాఖ అధ్యక్షులు, బట్టి పెల్లి నాగ మల్లయ్య, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కోల లింగయ్య, తాటికొండ సోమిరెడ్డి, కారింగుల జానయ్య , వార్డు సభ్యులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టు వాసుపై దాడి హేయమైన చర్య

- రౌడీ షీటర్ల అండ దండలతో జర్నలిస్టుపై దాడి
- జర్నలిస్టులపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి
- జర్నలిస్ట్ పై దాడి చేసి జర్నలిస్ట్ పైనే కేసు పెట్టిన వైనం



**శామీర్ పేట్,విశాలభారతి:** సమాజానికి నాలుగు పిల్లర్లు న్యాయం, చట్టం, రాజకీయం, నాలుగో పిల్లర్ మీడియా అలాంటి జర్నలిస్టుల పైన దాడులు చేస్తున్న కఠిన చర్యలు తీసుకునే విధంగా చట్టం చేయాలని పలువురు జర్నలిస్టులు డిమాండ్ చేశారు. శుక్రవారం అలియాబాద్ చౌరస్తాలోని పిస్తా హౌస్ హోటల్ దగ్గర సిఎంఆర్ కన్వెన్షన్ హాల్లో మంత్రి మల్లారెడ్డి నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని అనంతరం బయటికి శామీర్ పేట్ విశాలభారతి దినపత్రిక విలేఖరి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో బాగంగా తన వాహనం వైపు వెళుతుంటే వేణు అనే వ్యక్తి వచ్చి జర్నలిస్టు వాసును దుర్భాషలాడాడు. అంతేకాకుండా అతనిపై దాడి చేశాడు. ఆ దాడిలో వాసు కుడిచేతి నాలుగవ వేలిని కోరకడంతో పళ్ళు లోపలికి దిగాయి. దీంతో జర్నలిస్టుల వాసుపై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొని ఇలాంటివి మరొకసారి పునరావృతం కాకుండా చూడాలని స్థానిక విలేకరులు పరుశురాం ,రవి గౌడ్,రాము, సత్యనారాయణ ,అమర్,డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రతిపక్ష కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేటటువంటిది జర్నలిస్టు వృత్తి అని, అలాంటి వృత్తిలో సేవలు అందించే వాసుపై దాడి చెయ్యడం హేమమైన చర్యని అన్నారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత జర్నలిజానికి మరింత గౌరవం పెరుగుతుందని ఆశించాము కానీ దురదృష్టవశాత్తు సమాజంలోని కొన్ని దుష్టశక్తులు జర్నలిస్ట్ లపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు.



## సైంటిస్ట్ కిరణ్‌కు ఐవీ సుబ్బారావు వార్షిక అవార్డు

**గరిడేపల్లి, విశాల భారతి :** శాస్త్రవేత్త ఎ.కిరణ్ కి రైతునేస్తం పద్మ శ్రీ డాక్టర్.ఐ.వి సుబ్బారావు వార్షిక అవార్డు 2023 ప్రధానోత్సవం చేసినట్లు తెలిపారు.శనివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలోని(కేవీకే)లోని మృత్తిక శాస్త్రవేత్త ఎ.కిరణ్ కి 'రైతునేస్తం'19వ వార్షికోత్సవ సందర్భంగా వ్యవసాయ రంగానికి జీవితాంతం సేవలందించిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వర్గీయ "పద్మశ్రీ' డాక్టర్ ఐ.వి.సుబ్బారావు పేరిట 'రైతునేస్తం పురస్కారాలు' వ్యవసాయ అనుబంధ రంగాలలో విశేష ప్రతిభ కనపరచిన శాస్త్రవేత్తలు అభ్యుదయ రైతులు,విస్తరణ విభాగంలో అధికారులను అవార్డులతో ప్రతి సంవత్సరం ఘనంగా సత్కరిస్తుంది. స్వర్ణభారత్ ట్రస్ట్,ఆత్కూరు, గన్నవరం దగ్గర,కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు చేతుల మీదుగా కే.వి.కే గడ్డిపల్లి మృత్తిక శాస్త్రవేత్త ఎ.కిరణ్ రైతునేస్తం పద్మ శ్రీ డా॥. ఐ.వి.సుబ్బారావు వార్షిక అవార్డుల 2023 శాస్త్రవేత్తల విభాగంలో అందుకున్నట్లు తెలియజేశారు.ఇవి శాస్త్రవేత్తలకు, రైతులకు & విస్తరణ విభాగంలో సేవలు అందించిన అధికారులకు వారి అభ్యున్నతికి కృషి చేసిన వారికి ఇచ్చే గొప్ప గౌరవమన్నారు.ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో శాస్త్రవేత్తలు చేపట్టిన వివిధ సేంద్రీయ మరియు ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమాలు, ప్రదర్శన క్షేత్రాలు,సేంద్రీయ కీలక ఉత్పత్తుల పంపిణీలతో రైతులను సేంద్రీయ వ్యవసాయ మీద చైతన్యం చేయడం,వ్యవసాయ అనుబంధ రంగాల్లో విస్తృత కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించినందుకు గాను ఈ అవార్డును పొందినట్లు తెలిపారు. వీరితోపాటు పురస్కార గ్రహీతలు"జీవిత సాఫల్య' పురస్కారం డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ (డీడీఎస్ )పాస్తాపూర్ జహీరాబాద్ 'కృషిరత్న' బిరుదు ప్రదానం ఆకాష్ చౌరాసియా బహుళ అచంలా సాగు విధానం,15 మంది అభ్యుదయ రైతులు, వ్యవసాయం,దాని అనుబంధ రంగాలకు విశేష కృషి చేసిన 14 మంది శాస్త్రవేత్తలు,వ్యవసాయ విస్తరణకు విభాగంలో కృషిచేసిన వారికి రైతునేస్తం పురస్కారాలు అందించారు.కే.వీ.కే బోర్డ్ యాజమాన్యం,శాస్త్రవేత్తలు ఇతర సిబ్బంది యొక్క కృషి సహకారం ను అందించిన అందరికి కే. వి కే శాస్త్రవేత్త ఎ.కిరణ్ ధన్యవాదాలు తెలిపారు.ఈ అవార్డ్ అందుకోవడంతో బాధ్యత ఇంకా పెరిగిందని ఇంకా ఎక్కువ మొత్తంలో సేంద్రియ వ్యవసాయ శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతు నేస్తం వ్యవస్థాపకులు యడ్లపల్లి వెంకటేశ్వరరావు,ట్రస్ట్ చైర్మన్,మాజీ మంత్రి కామినేని శ్రీనివాస రావు, ముప్పవరపు ఫౌండేషన్ ట్రస్టీ ఎం.రాధా మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.



## 'కాంగ్రెస్‌పార్టీ భువనగిరి టికెట్‌బీసీలకు కేటాయించాలి'

**భువనగిరి టౌన్, విశాల భారతి :**సోనియా గాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ స్కీమ్ లను మేము తక్షణమే ఈ క్షణం నుండే ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో ప్రతి మండలంలోని ప్రతి గడపగడపకు తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ హయం లో కి వస్తే ఏ విధంగా ఈ పేద బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుదని మేము వివరించడానికి ఇవ్వాళ నుండి పంజాల రామాంజనేయులు గౌడ్ గారి నేతృత్వంలో మేము వెళ్లడానికి నిర్ణయించుకున్నాం అదేవిధంగా భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నేను ఉన్నాను అని కాంగ్రెస్ కేడర్ను కాంగ్రెస్ కార్యకర్తలను కాపాడుకుంటూ వచ్చి ఈరోజు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేసిండు అదేవిధంగా ఈరోజు కొత్తగా వచ్చిన వాళ్ళు ఆశవాహులు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్నారు కాని ఈరోజు ఢిల్లీ పెద్దలు తొలి జాబితా రిలీజ్ చేసినారు చేసినా కూడా భువనగిరి నియోజకవర్గ టికెట్ ఆపినారు కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు బీసీ నాయకులకు ఇస్తారని ఆశిస్తున్నాము కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు బీసీలకు టికెట్ కేటాయించాలని చాలా కష్టపడుతున్నారు కాంగ్రెస్ పార్టీ బీజీ వాళ్లకి టికెట్టు కేటాయించాలని డిమాండ్ చేస్తా ఉన్నాము టికెట్ ఎవరికి వచ్చినా అందరం కలిసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కష్టపడతాము భువనగిరి టికెట్ గెలిపించుకొని అధిక సంఖ్యలో గెలిపించుకొని అధిష్టానానికి బహుమతిగా ఇస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాము కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలని ఏ విధంగా అన్యాయం చేస్తున్నాయో వివరించి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం వల్ల న్యాయం జరుగుతుందని వివరించి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడుతాము అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. గడపగడపకు కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఆరు గ్యారెంటీ కార్డును ప్రచార కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు గోదా రాహుల్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ రాబోయే రోజుల్లో బోనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలిపియాలని ప్రచార కార్యక్రమంలో ప్రజలందరినీ కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటేయాల్సిందిగా కోరారు ఈ కార్యక్రమంలో పట్టణ ఓపీసీసీ అధ్యక్షులు కాలియా నాగరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి సాల్వేరు ఉపేందర్ జిల్లా కార్యదర్శి పవన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు జిట్ట మల్లారెడ్డి బొమ్మిడెల్లి రమేష్ వట్టిపల్లి శివకుమార్ గోదా సాయిలు వలిగొండ టౌన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ చింటూ మల్లేష్ హర్షిత్ కార్తీక్ శరత్ యాదవ్ కళ్యాణ్ కృష్ణతదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ పార్టీ గెలుపుకు కృషి చెయ్యాలి

- అల్వాల్ కాంగ్రెస్ నేతలు బిఆర్ఎస్ చేరికలు
- ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్

**అల్వాల్,విశాలభారతి:** సీఎం కెసీఆర్ చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై అల్వాల్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఎంబిసి కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ లో పార్టీ చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలే ప్రజలకు న్యాయం చేస్తున్నాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలుపుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆదివారం విడుదల చేసిన మేనిఫెస్టో ప్రకటించిన సందర్భంగా 135వ డివిజన్ కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్ ఆధ్వర్యంలో భూదేవినగర్ లోని అంబేద్కర్ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాల వేసి కార్యకర్తలంతా హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంచుకున్నారు.

## బాలత్రిపుర సుందరి దేవి ఆలంకరణలో చండిక అమ్మవారు

పాలకుర్తి, విశాల భారతి: పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మేళతాళాలు అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య మహా వైభవోపేతంగా నిర్వహించారు.మొదటిరోజు చండిక అమ్మవారు అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు పాల్గొని కనులారా తిలకించి తరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బి లక్ష్మీప్రసన్న అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.





# 'భగవంత్ కేసరి' ప్రేక్షకుల మనసులో చిరస్థాయిగా నిలిచిపోతుంది

**: గ్రాండ్ ప్రెస్ మీట్ లో నందమూరి బాలకృష్ణ**

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ హీరోగా సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో, ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్ లో రూపొందుతున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'భగవంత్ కేసరి'. కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తుండగా శ్రీలీల కీలక పాత్ర పోషిసున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం టీజర్, పాటలు, ట్రైలర్ ప్రతి ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ ని క్రియేట్ చేశాయి. భగవంత్ కేసరి దసరా కానుకగా అక్టోబర్ 19న విడుదల కానున్న నేపధ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్ ప్రెస్ మీట్ ని నిర్వహించింది. ప్రెస్ మీట్ లో నటసింహ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. దుర్గమ్మ వారి నవరాత్రులు జరుపుకుంటున్న ఈ తరుణంలో నా 108 చిత్రంగా భగవంత్ కేసరి ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా వుంది. దుర్గ అంటే స్త్రీ శక్తి. ఈ సినిమా కథ కూడా స్త్రీ శక్తికి సంబధించినదే. దుర్గమ్మ వాహనం పులి. ఈ సినిమాలో కూడా అమ్మాయిని పులిలా పెంచాలనే మాట వుంది. అలాగే సినిమా పేరు కూడా భగవంతుడితో మొదలైయింది. నేలకొండ భగవంత్ కేసరి హై ఎనర్జీ తో వుంటుంది. అనిల్ రావిపూడి భిన్నమైన సినిమాలు చేశారు. ముందు మా అన్నయ్య గారి అబ్బాయి కళ్యాణ్ రామ్ తో పటాస్ చేశాడు. అందులో కూడా నా పాటని రీమిక్స్ చేశాడు. ఆయన సినిమాలు గమనిస్తే అన్నీ డిఫరెంట్ గా వుంటాయి. చాలా అద్భుతమైన కథతో వచ్చారు. మేమిద్దరం ఈ సినిమా ఒక సవాల్ గా తీసుకున్నాం. చాలా హోం వర్క్ చేశాం. నేను ఏది చేసినా నా అభిమానులని దృష్టిలో పెట్టుకుంటాను. భగవంత్ కేసరి ట్రైలర్ అభిమానులు, ప్రేక్షకులు, అందరినీ ఆకట్టుకుంది. సినిమా ఇంకా గొప్పగా అలరిస్తుంది. నటుల నుంచి, సాంకేతిక నిపుణుల నుంచి తను కోరుకున్నది రాబట్టుకునే దర్శకుడు అనిల్. ఆయన లాంటి దర్శకుడు ఇండస్ట్రీకి ఒక వరం. తమన్ అఖండతో బాక్సులు బద్దలగొట్టాడు. చాలా ప్రతిభావంతుడు. అద్భుతమైన పాటలు నేపధ్య సంగీతం అందించాడు. అలాగే రామ్ ప్రసాద్ గారు అద్భుతమైన డీవోపీ. నా ప్రతి కదలిక తనకి తెలుసు. ఒకరిని ఒకరు పూర్తిగా అర్ధం చేసుకున్నాం. తన కెమరా ద్వారా ఎలాంటి మ్యాజిక్ ని క్రియేట్ చేశారో ప్రేక్షకులు చూస్తారు. కాజల్ అద్భుతమైన నటి. చాలా మంచి పాత్ర చేశారు. ఒక విస్ఫోటనం జరిగితే గానీ ఇలాంటి కలయిక జరగదు. విస్ఫోటనం జరిగితేనే ఇలాంటి అద్భుతాలు జరుగుతాయి. అలాంటి అద్భుతాల్లో ఒకటి మా భగవంత్ కేసరి. శ్రీలీల బోర్న్ ఆర్టిస్ట్. మా ఇద్దరి మధ్య చాలా బరువైన సీన్స్ వుంటాయి. ఆడమగా అనే తేడా లేకుండా అందరూ చప్పట్లు కొట్టి కన్నీళ్ళతో థియేటర్ నుంచి బయటికి వస్తారు. ప్రతి సన్నివేశానికి లేచి చప్పట్లు కొడతారు. అంత అద్భుతంగా వచ్చింది మా మధ్య కెమిస్ట్రీ. ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించాలనే తపన శ్రీలీల లో వుంది. అందుకు అభినందనలు. అర్జున్ రామ్ పాల్ నటన అదరగొట్టారు. తనే డబ్బింగ్ చెప్పారు. ప్రతి పాత్ర అద్భుతంగా వుంటుంది. ప్రేక్షకులందరినీ సినిమాలో కి తీసుకెళ్ళిపోతుంది. నిర్మాతలు హరీష్, సాహు చాలా అద్భుతంగా సినిమాని నిర్మించారు. వారి నిర్మాణంలో మరిన్ని సినిమాలు రావాలని కోరుకుంటున్నాను. సమరసింహారెడ్డి, నరసింహానాయుడు.. అఖండ... ఇలా గుర్తుండిపోయే పాత్రలు చేయడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. భగవంత్ కేసరి పాత్ర కూడా గుర్తుండిపోతుంది. సినిమాతో పాటు ఇందులో పాత్రలు కూడా చిరస్థాయిగా నిలిచిపోతాయి. అంతచక్కగా ఈ ఇందులో పాత్రలని మలిచాడు దర్శకుడు అనిల్ రావిపూడి. తనో మళ్ళీ కలసి పని చేయడానికి ఎదురుచూస్తుంటాను. 19న మా భగవంత్ కేసరి సినిమా విడుదల కాబోతుంది. తప్పకుండా మీ అందరి ఆశీర్వాదం వుంటుంది. అందరికీ ధన్యవాదాలు'' తెలిపారు.

# జోజు జార్జ్, ఐశ్వర్య రాజేష్ పులిమేద ట్రైలర్ విడుదల !





ఐన్ స్టీన్ మరియు ల్యాండ్ సినిమాస్ బ్యానర్ పై ఏ. కె.సజన్ దర్శకత్వంలో జోజు జార్జ్, ఐశ్వర్య రాజేష్ హీరో హీరోయిన్లుగా నటుస్తున్న సినిమా పులిమేద. తాజాగా విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్, టీజర్ కు మంచి స్పందన లభించింది. తాజాగా చిత్ర యూనిట్ ట్రైలర్ ను విడుదల చేసింది. ఇటీవల ఇరట్ట సినిమాతో మంచి విజయం సాధించిన జోజు జార్జ్ పులిమేద సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడం విశేషం. తెలుగు ప్రేక్షకులకు సూపరిచితమైన ఐశ్వర్య రాజేష్ ఈ సినిమాలో మరో మంచి రోల్ ప్లే చేస్తోంది. ఐన్ స్టీన్ మీడియా గతంలో జోజు జార్జ్ తో డైరెక్టర్ జోషి దర్శకత్వంలో అంథోని సినిమా చేశారు, పులిమేద వారి కాంబినేషన్ లో రెండో సినిమా. ఈ సినిమాకు ఇషాన్ దేవ్ సంగీతం అందించారు అలాగే రఫీక్ అహమ్మద్, డాక్టర్ తార, జయశంకర్ ఫాదద్ మైఖేల్ సాహిత్యం అందించారు. బాలచందర్ మీనన్, క్రీమ్బన్ వినోద్, జానీ అంథోని, జాఫర్ ఇదుక్కి, జియో బేబీ, అబు సలీమ్, సోనా నాయర్, కృష్ణ ప్రభ, పూలే విల్సన్, శిబిల తదితరులు ఈ సినిమాలో నటించారు. అక్టోబర్ 26న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది చిత్ర దర్శక నిర్మాతలు చెబుతున్నారు.




# 'డెవిల్'లో మాళవికా నాయర్ లుక్ రిలీజ్

నందమూరి కళ్యాణ్ రామ్..విలక్షణమైన పాత్రలను ఎంచుకుంటూ, వైవిధ్యమైన సినిమాల్లో నటిస్తూ తనదైన గుర్తింపును సంపాదించుకున్న స్టార్ హీరో. ఈయన కథానాయకుడిగా నటిస్తోన్న తాజా చిత్రం 'డెవిల్'. 'బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' ట్యాగ్ లైన్. అభిషేక్ నామా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆదివారం ఈ మూవీలో పవర్‌ఫుల్ పొలిటీషియన్ పాత్రలో నటిస్తోన్న హీరోయిన్ మాళవికా నాయర్ పాత్రకు సంబంధించిన లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. మణిమేకల పాత్రలో మాళవికా నాయర్ కనిపించనున్నారు. ఆమె లుక్ పోస్టర్‌ను గమనిస్తే.. డిఫరెంట్ హెయిర్ స్టైల్లో కనిపిస్తున్నారు. మైకు ముందు నిలబడి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్నట్లు ఉంది. అయితే ఆమె పాత్రకు ఈ సినిమాకు కథకు ఉన్న లింకేంటనేది తెలుసుకోవాలంటే మాత్రం నవంబర్ 24న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ కానున్న సినిమాను చూడాల్సిందేనంటున్నారు నిర్మాతలు. పాన్ ఇండియా లెవల్లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో డెవిల్ సినిమాను నవంబర్ 24న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. 'డెవిల్' చిత్రంలో ఎవరికీ అంతు చిక్కని ఓ రహస్యాన్ని ఆయన ఛేదించే బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్‌గా నందమూరి కళ్యాణ్ రామ్ ఆకట్టుకోబోతున్నారు. గత ఏడాది తెలుగు సినీ ఇండస్ట్రీలో వన్ ఆఫ్ బిగ్గెస్ట్ హిట్ మూవీగా నిలిచిన 'బింబిసార'తో మెప్పించిన కళ్యాణ్ రామ్ ఈ ఏడాది 'డెవిల్'తో మెప్పించటానికి రెడీ అవుతున్నారు.

# నవంబర్ 4న 'శంకర్ దాదా ఎంబీబీఎస్' రీ రిలీజ్



మెగాస్టార్ చిరంజీవి నటించిన శంకర్ దాదా ఎంబీబీఎస్ సినిమా అప్పట్లో బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. 2004లో వచ్చిన ఈ చిత్రం అప్పటి రికార్డుల ను బ్రేక్ చేసింది. శంకర్ దాదాగా చిరంజీవి నటించిన తీరు, చెప్పిన ఇంగ్లీష్ సామెతలు, వేసిన స్టెప్పులు అన్నీ కూడా ప్రేక్షకులకు విపరీతంగా నచ్చేశాయి. మెగా అభిమానులు మాత్రమే కాకుండా సాధారణ సినిమా ప్రేమికులు సైతం శంకర్ దాదా ఎంబీబీఎస్ సినిమాకు ముగ్దులయ్యారు. అసలే ఇప్పుడు నాటి కల్ట్ క్లాసిక్ సినిమాలను రీ రిలీజ్ చేస్తున్నారు. టాలీవుడ్‌లో ఎక్కువగా రీ రిలీజ్‌ల ట్రెండ్ నడుస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవి ఎవర్ గ్రీన్ బ్లాక్ బస్టర్ అయిన శంకర్ దాదా ఎంబీబీఎస్ సినిమాను రీ రిలీజ్ చేసేందుకు సర్వం సిద్దమైంది. నవంబర్ 4న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేశారు. మెగా ప్రొడక్షన్స్ ద్వారా ఈ చిత్రం నవంబర్ 4న భారీ ఎత్తున రిలీజ్ కాబోతోంది. మరోసారి అప్పటి వింటేజ్ చిరుని చూపించేందుకు, ఆ గ్రేస్, మాస్ ఎరాలోకి తీసుకెళ్లేందుకు శంకర్ దాదా వస్తున్నాడని సోషల్ మీడియాలో సినీ లవర్స్ ట్వీట్లు, కామెంట్లతో సందడి చేస్తున్నారు.



# సైకిల్ పై పూజా మేడం గ్లామర్ ట్రీట్..

టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపుని సొంతం చేసుకున్న అందాల భామ పూజా హెగ్డే. ఈ అమ్మడు ముకుంద సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. దువ్వాడ జగన్నాథమ్ మూవీ తర్వాత వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం లేకుండా స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. టాలీవుడ్ లో ప్రస్తుతం ఉన్న స్టార్స్ తో వరుస సినిమాలు చేసింది. గత ఏడాది ఈమె నుంచి వచ్చిన రాధేశ్యామ్, ఈ ఏడాదిలో సల్మాన్ ఖాన్ చిత్రాలు పూజా కెరియర్ లో బిగ్గెస్ట్ డిజాస్టర్ గా మారాయి. రణవీర్ సింగ్ తో చేసిన సర్కస్ కూడా డిజాస్టర్ అయ్యింది. దీంతో చేతిలోకి వచ్చిన అవకాశాలు కూడా పూజా హెగ్డే కోల్పోయింది. ఈ ఏడాది గుంటూరు కారం, ఉస్తాద్ భగత్ సింగ్ ఆఫర్స్ ని పూజా హెగ్డే కోల్పోయింది. అయితే సంపత్ నంది దర్శకత్వంలో సాయితేజ్ హీరోగా తెరకెక్కనున్న మూవీలో హీరోయిన్ గా ఖరారు అయినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఆ మధ్యకాలంలో షూట్ సమయంలో కాలుకి ఫ్యాక్చర్ అయ్యింది. దాని కారణంగా కొంతకాలం రెస్ట్ తీసుకుంది. మరల ఇప్పడు యాక్టివ్ అయ్యి వెకేషన్స్ ఎంజాయ్ చేస్తోంది. బర్త్ డే సందర్భంగా మాల్దీవుల్లో ఎంజాయ్ చేస్తోన్న ఈ బ్యూటీ అక్కడ హ్యాపీగా సైకిల్ తొక్కుతున్న ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ఈ ఫోటోలు కాస్తా ఇప్పడు వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలని చూస్తున్న ఆడియన్స్ అల వైకుంఠపురంలో సామజవరగమన సాంగ్ పాడుకున్తున్నాడు. వయ్యారాల ముద్దుగుమ్మ చిరునవ్వులకి కుర్రాళ్ళు పులకరించిపోతున్నారు. పూజా హెగ్డేని వీలైనంత వేగంగా పూజా హెగ్డే సిల్వర్ స్క్రీన్ పై కనిపిస్తే చూడాలని ఫ్యాన్స్ అందరూ వెయిట్ చేస్తున్నారు. ఇన్ స్టాగ్రామ్ లో లో పిక్స్ షేర్ చేసిన ఈ బ్యూటీ తనకి బర్త్ డే విషెస్ చెప్పిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ పోస్ట్ పెట్టారు. త్వరలో మీ అందరి మెసేజ్ లకి రిప్లై ఇస్తానంటూ చెప్పకొచ్చింది. ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఇన్ స్టాలో ఈ పిక్స్ కి ఏకంగా 4.86 లక్షల మంది వీక్షించడం విశేషం.

# 'హాయ్ నాన్న' ప్రేక్షకులందరినీ అలరించే మోస్ట్ కమర్షియల్, యూనిక్ మూవీ: నాని



సండే అంటే ఫ్యామిలీ టైం. నేచురల్ స్టార్ నాని తన పాన్ ఇండియా చిత్రం 'హాయ్ నాన్నా' నుంచి మనసుని హత్తుకునే టీజర్ ను విడుదల చేయడంతో ఈ సండే మరింత ప్రత్యేకంగా నిలిచింది. నాని, బేబీ కియారా ఖన్నా మధ్య అందమైన ప్రయాణంతో తండ్రీకూతుళ్ల కథగా టీజర్ ప్రారంభమవుతుంది. తర్వాత నాని, మృణాల్ ఠాకూర్ లవ్ జర్నీని ప్రజంట్ చేసింది. బేబీ కియారా అతని కూతురా? నాని, మృణాల్‌ని ఇంతకు ముందు కలిశాడా? మృణాల్ వేరొకరితో తన పెళ్లికి ముందు నానికి ఎందుకు ప్రపోజ్ చేసింది? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే. దర్శకుడు శౌర్యువ్ తన మొదటి సినిమాతోనే మ్యాజిక్ చేశాడు. తొలి సినిమాలో చాలా భావోద్వేగాలతో కూడిన స్క్రిప్ట్‌ను డీల్ చేయడం అంత సులభం కాదు. కానీ శౌర్యువ్ మొదటి సినిమాతోనే పరిణితి చూపించాడు. భావోద్వేగాలను చక్కగా బ్యాలెన్స్ చేశాడు. తండ్రీ కూతుళ్ల బంధం ప్రతి తండ్రి కి కనెక్ట్ అవుతుండగా, నాని, మృణాల్ ల ప్రేమ కథ జాయ్ ఫుల్ గా వుంది. నాని ఎప్పటిలాగే తన అద్భుతమైన నటనతో అదరగొట్టారు. నాని చాలా కాలం తర్వాత ఇలాంటి ఎమోషనల్ క్యారెక్టర్‌లో కనిపించడం విశేషం. నాని మాట్లాడుతూ .... హాయ్ నాన్న చాలా యూనిక్ సబ్జెక్ట్. ఒకొక్క ప్రమోషన్ కంటెంట్ వచ్చే కొద్ది కథ, కాన్సెప్ట్ ప్రత్యేకత గురించి తెలుస్తూనే వుంటుంది. ఇది టీజర్ ఈవెంట్ కాబట్టి అన్నీ టీజ్ చేయడానికే (నవ్వుతూ). కమర్షియల్ అంటే అందరికీ, అన్ని ఏజ్ గ్రూప్స్ ప్రేక్షకులందరినీ అలరించేది. అలా చూసుకుంటే .. హాయ్ నాన్న మోస్ట్ కమర్షియల్ మూవీ. నచ్చనిది చేయడం బరువుగా వుంటుంది. నచ్చినది చేయడం తేలికగా వుంటుంది. నాకు నచ్చిన సినిమా చేస్తున్నాను. నిజానికి నేను ఏదీ పెద్దగా కాలిక్యులేట్ చేసి చేయను, మనసుకు నచ్చింది చేసేస్తాను. ఈ రోజువరకూ చేసిన ప్రతి సినిమా కూడా ప్రేక్షకులు గొప్పగా ఆదరించారు. నాకు నచ్చింది ప్రేక్షకులకు నచ్చుతుందనే భరోసా ఇచ్చారు. డిసెంబర్ 7న అది మరోసారి ప్రూవ్ అవుతుందని నమ్ముతున్నాను. రోజులు మారాయి. పద్దతులు కూడా మారాలని భావిస్తాను. ప్రేక్షకులు చాలా ఫాస్ట్ గా అప్డేట్ అవుతున్నారు. వాళ్ళని అందుకోలేకపోతే చాలా కష్టం. చాలా గ్రేట్ ఫీలింగ్ అండీ. 'ఈ పేరు నేనే పెట్టాను కదా' అని అంటుంటాడు. నువ్వే పెట్టావ్ నీ సినిమానే అని చెబుతుంటాను. జెర్సీ, హాయ్ నాన్న లాంటి సినిమాలు అర్ధం చేసుకొనే వయసు వాడికి వుందో లేదో తెలీదు. కానీ ఏదో ఒక రోజు ఈ సినిమాలు చూసి గర్వపడతాడని నా నమ్మకం. శైలేష్ ఏ కథ చేసుకున్న అభిప్రాయం కోసం ముందు నాకు చెప్తాడు. సైంధవ్ అదిరిపోతుంది. డిసెంబర్, జనవరిలో డిఫరెంట్ జోనర్స్ లో బ్లాక్ బస్టర్స్ చూస్తారనే నమ్మక్మం వుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.